ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (గురు)
సహరి : 4.40 (శుక్ర)

వేగంగా కదలండి... మార్పు చూపండి


కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రులు

- పర్యాటకంతో పాటు ఆక్వాకు ప్రాధాన్యం
- జిల్లాలో పాడి పుంజుకోవాలి
- పామాయిల్ రైతులకు న్యాయం జరగాలి
- చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తాం
- గోదావరి పుష్కరాలను సిద్ధం కండి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- జిల్లా ప్రగతి, అవసరాలను నివేదించిన కలెక్టర్ వెట్రిసెల్వి

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

'చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో టెంపుల్ టూరిజం ప్రోత్సహించాల్సిందే. దీనికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయండి. పామాయిల్‌లో మంచి దిగుబడులే వస్తున్నాయి. ఆయా రైతులు, ఫ్యాక్టరీలతో మాట్లాడి మంచి ధర వచ్చేలా చూడండి. గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. తగు ఏర్పాట్లకు సిద్ధంగా ఉండండి. ఆక్వా రంగంలో పురోభివృద్ధి ఉండాల్సిందే'.. అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన బుధవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి జిల్లా అవసరాలు, పురోగతి, ఇతరత్రా అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా జోన్-2 పరిధిలో ఉన్న జిల్లా ఏ రూపంలో అభివృద్ధి చెందాలో వివరిస్తూ తదనుగుణంగానే చర్యలకు దిగాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే.. 'పామాయిల్ దిగుబడి తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలోను బాగుంది. ఏలూరు జిల్లా టాప్‌లో ఉంది. ఇక పెంచడానికి అవకాశాలున్నాయి. దీన్ని వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలి, పారదర్శకంగా ఫ్యాక్టరీలతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలి. గోదావరి పుష్కరాలకు రాజమండ్రి కేంద్రం. ఈ సందర్భంగా పోలవరం పరిసర ప్రాంతాల్లో 5 వేల రూముల రావాలని ఆలోచన. పోలవరంలో నాలుగైదు హోటళ్లు వస్తాయి. టూరిజంలో 20 శాతం వృద్ధి కనిపించాలి. టెంపుల్ టూరిజం పెరగాలి. గోదావరి, పాపికొండలు ఫేమస్ టూరిజం ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ఏకో టూరిజంలో భాగంగా జలపాతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. టూరిజంతో పాటు ఆక్వా కల్చర్‌ను అభివృద్ధి చేయాలి. మత్స్యకారులను ఇందులో భాగస్వామ్యం చేయాలి. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తికి చర్యలు తీసుకొంటా. గోదావరి జిల్లాలో పాడి పరిశ్రమ మరింత పెరగాలి. పశువైద్యశాలల మరమ్మతులు, డిస్పెన్సరీల అభివృద్ధికి నిధులిస్తాం. రోడ్ల అభివృద్ధికి సీ కేటగిరి కింద నిధుల మంజూరు చేస్తాను. గోపన్నపాలెం పీఈటీ కళాశాలలో వసతి కల్పనకు చర్యలు తీసుకొంటా' మని తెలిపారు. రిజర్వాయర్లలో చేపలు పెంచడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందన్న జిల్లా కలెక్టర్ సూచనతో ఆయన ఏకీభవించారు.

ఎన్నో చేస్తున్నాం .. మరెన్నో అవసరాలు : కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా తగినంత పురోగతిని సాధించడానికి ప్రయత్నిస్తున్నాం. సోలార్ దగ్గర నుంచి వ్యవసాయం, గృహ నిర్మాణం, పర్యాటకానికి తగినంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కలెక్టర్ వెట్రిసెల్వి వివరించారు. నాలుగు వేల ఎకరాల ల్యాండ్ బ్యాంకు సిద్ధంగా ఉంచాం. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చేవారికి భూమిని అందుబాటులో ఉంచామని చెప్పుకొచ్చారు. ద్వారకాతిరుమల ఆలయంతో పాటు మిగిలిన ఆలయాలు, పొరుగు జిల్లాలోని దేవీపట్నం గండిపోచమ్మ ఆలయం, పాపికొండలు తదితర ప్రాంతాలన్నింటిని ఒకేసారి ఉదయం నుంచి సాయంత్రంలోపు చూసి వచ్చేలా, పర్యాటకుల్ని మరింత ఆకర్షించేలా ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. తలసరి ఆదాయంలో 4లక్షలు టార్గెట్‌గా తీసుకున్నామని, మామిడి రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. వీటితో పాటు సీఎంకు సమర్పించిన నివేదికలో పలు అంశాలను కలెక్టర్ వెట్రిసెల్వి సోదాహరణంగా వివరించారు. పీఎం సూర్యఘర్ కింద గృహ అవసరాలకు ఇళ్ల పైకప్పుపై సోలార్ రూఫింగ్ 70 వేళ్ల ఇళ్లకు ఏర్పాటు చేయడం ద్వారా 3వేల కిలోవాట్స్ పవర్ ఉత్పత్తికి నిర్ణయించామన్నారు. ఇదే పథకం కింద ఐదు సోలార్ మోడల్ విలేజ్‌ల కింద ద్వారకాతిరుమల, దుగ్గిరాల, చిననింద్రకొలను, తడికలపూడి, యర్రంపేటల్లో పైప్‌లైన్లు ద్వారా 235.55 ఎకరాలకు 44 మెగావాట్ల సోలార్ కెపాసిటి ఏర్పాటు చేయనున్నామన్నారు. మార్చి 26లోగా 15,059 కుళాయి కనెక్షన్ల పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గృహ నిర్మాణాలను జూన్ 2025 నాటికి 7,400 ఇళ్ల పూర్తి చేసి గృహ ప్రవేశాలకు చర్యలు చేపడతామన్నారు. పంచాయతీరాజ్ కింద 230 కిలోమీటర్ల సీసీ రోడ్లుతో శివారు గ్రామాలకు రవాణాను అనుసంధానంను మార్చి 2026 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆర్అండ్‌బీ కింద 92.42 కిలోమీటర్లు గుంతలను పూడ్చించామని, ఎన్‌హెచ్ -365 ఖమ్మం నుంచి దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఎన్‌హెచ్ -165 పామర్రు టు ఆకివీడు, ఎన్‌హెచ్ -365 బీబీ కింద జీలుగుమిల్లి- పట్టిసంలో రోడ్ల కనెక్టవిటిని వచ్చే ఏడాది మార్చికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. టూరిజం సర్క్యూట్ కింద కొల్లేరు పక్షుల పండుగను జనవరి 26న చేపడతా మని, పోలవరంలో అత్యాధునిక రిసార్ట్స్, పాపికొండల్లో అంత్రా గ్రూప్‌తో రివర్ వాటర్ క్రూయిజ్‌పై చర్చిస్తున్నామని, ఈ కార్యక్రమాలతో రెవెన్యూ పెంపుతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ఏకో టూరిజం డెవలప్ అవుతుందని ఆమె తెలిపారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

సీఎం దృష్టికి కీలకాంశాలు

- జిల్లాలో వ్యవసాయ, ఉద్యానపంటలకు ధాతు లోపాల నివారణకు జింక్, జిప్సమ్,బోరాన్‌లు రైతులకు సరఫరా జరగడం లేదు. సూక్ష్మధాతు లోపాలను అధిగమించడానికి ఇవి రైతుకు సబ్సిడీపై ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- జిల్లాలో పశుసంవర్ధకశాఖ పరంగా 48 పశువైద్యశాలలు మరమ్మతులు చేయాల్సి ఉందని, 60 వరకు డిస్పెన్సరీలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు.
- ఫిష్ సీడ్స్ ఫారమ్స్, క్వాలిటీ సీడ్స్ తయారీ వల్ల ఆదాయం పెరుగుతుందని, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, రిజర్వాయర్లలో వీటి ఉత్పత్తి చేయడానికి రెండు చోట్ల ఫారమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని, వీటికి నిధుల సపోర్టు కావాలని విన్నవించారు.
- జిల్లాలో మంచినీటి వనరుల నిర్వహణకు సత్యసాయి సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణకు 2017 నుంచి 2025 వరకు 24.90 కోట్ల బకాయిలు ఉన్నాయని, ఇవి విడుదల చేసి మంచినీటి పథకాలను సవ్యంగా నిర్వహించడానికి తోడ్పాటు అందించాలని కోరారు.
- ఆర్అండ్‌బీ పరంగా సీ కేటగిరి కింద రోడ్లు మంజూరు చేసి, నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ పీఈటీ కళాశాలలో వసతుల కల్పనకు నిధులు కావాలని వెట్రిసెల్వి వివరించారు.

వేసవి ఉపశమనానికి పాఠశాలల్లో 'నీటి గంట'


ఏలూరు అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత, వడగాడ్పుల నుంచి భద్రత చర్యల్లో భాగంగా జిల్లాలో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 'వాటర్ బెల్' కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రతీ విద్యార్థిని వాటర్ బాటిల్‌ను ఇంటినుంచి తరగతి గదికి తెచ్చుకోవడానికి అనుమతించాలని, రోజూ ఉదయం 10 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 12గంటలకు ఒకసారి నీటిగంటను స్కూలులో మోగించి బాలబాలికలు నీళ్ల తాగేందుకు సమయమివ్వాలని సూచించారు. దీని వల్ల అధిక ఉష్ణోగ్రతల వల్ల డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడవచ్చన్నారు. వాటర్ బెల్ కార్యక్రమం నిమిత్తం స్కూలులోని ఆర్వో సిస్టంలు, వాటర్‌కూలర్లు, నీటికుండలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, తగినంత తాగునీటి నిల్వలు ఉండేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ గంటకోసారి నీళ్ళు తాగడం ఆవశ్యకత, ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన నిమిత్తం తరగతి గదులు, వాటర్ పాయింట్ల వద్ద పోస్టర్లను ప్రదర్శించాలని కోరారు. ఒంటిపూట బడులు ముగిసేవరకు వాటర్‌బెల్ కార్యక్రమాన్ని నిర్వహించాలని హెచ్ఎంలను ఆదేశించారు.

2027 నాటికి పోలవరం పూర్తి

- నేడు సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన.. మంత్రి నిమ్మల ఏర్పాట్లు పరిశీలన
- భారీ భద్రతా దళాల మోహరింపు.. రెండు రోజులుగా ప్రాజెక్టు పరిసరాల్లో నిఘా


పోలవరం ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పోలవరం/ఏలూరు క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేసేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం సీఎం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్న నేపథ్యంలో బుధవారం మంత్రి నిమ్మల ఏర్పాట్లను పరిశీలించారు.ఐదేళ్లలో పోలవరం నిర్మాణం ఆలస్యం కావడంతో రాష్ట్రం ఆర్థికంగా 50 వేల కోట్లు నష్టపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించి రూ.12,157 కోట్ల నిధులు సాధించారని తెలిపారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతం, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం ప్రాంతాలను పరిశీలించారు. సీఈ నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు, మేఘా జీఎం అంగర సతీష్ తదితరులు ఉన్నారు.





ఏర్పాట్లు పటిష్టంగా చేయాలి : ఎస్పీ, జేసీ

సీఎం పోలవరం పర్యటన ఏర్పాట్లను పటిష్టంగా చేయాలని ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి అధికారులకు ఆదేశించారు. సీఎం పర్యటించనున్న ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను వీరు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులకు నిర్దేశించిన విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని హెచ్చరించారు. అనుమతి ఉన్న వారికి మాత్రమే హెలిప్యాడ్ వద్దకు అనుమతి ఇవ్వనున్నారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లైస్ డీఎం వి.శ్రీలక్ష్మి, డీఎస్‌వో ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా..

- గురువారం ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు ఉండవల్లి నుంచి హెలీకాప్టర్‌లో బయలు దేరతారు.
- 10.45 గంటలకు పోలవరం ప్రాజెక్టు హిల్ వ్యూ పాయింట్ నుంచి వీక్షిస్తారు.
- 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు సీఎం ప్రాజెక్టు నిర్మాణాలను పరిశీలించి, అధికారులతో సమీక్షిస్తారు.
- 3.10కు హెలీకాప్టర్‌లో ఉండవల్లి బయలుదేరతారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా చర్యలు

సీఎం పోలవరం ప్రాజెక్టు పర్యటన సందర్భంగా జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా గ్రే హౌండ్స్ దళాలు, యాంటీ నక్సల్స్ స్క్వాడ్ దళాలు అటవీ ప్రాంతంలో జల్లెడ పట్టాయి. అటవీ ప్రాంతం, పోలవరం ప్రాజెక్టు పరిసర 15 కిలోమీటర్ల వరకూ పోలీసులు పట్టు బిగించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.



రోడ్లు, డ్రెయిన్లు అధ్వానం

- వేసవి వచ్చేసింది.. నీటి సమస్య రాకుండా చూడండి
- ఉమ్మడి జిల్లాల నుంచి ఫోన్‌లో సమస్యలు విన్నవించిన ప్రజలు
- జడ్పీ సీఈవో భీమేశ్వర్‌తో ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్


6

లక్ష్యం దిశగా పోలవరం

- పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- శరవేగంగా డయాఫ్రం వాల్ నిర్మాణం
- కేంద్రం సహకారంతో నిధులు
- ఊపందుకున్న పనులు
- వైసీపీ పాలనలో ప్రాజెక్టు తిరోగమనం

7

నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్‌లకు ఉప ఎన్నికలు



ఏలూరు సిటీ/అత్తిలి/యలమంచిలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న అత్తిలి, యలమంచిలి ఎంపీపీ పదవు లకు, అత్తిలి, ఏలూరు, కైకలూరు వైఎస్ ఎంపీపీ పదవులకు గురువారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్ తెలిపారు. పశ్చిమలో 17, ఏలూరులో 10, తూర్పుగోదావరిలో ఆరు గ్రామాల్లో ఉప సర్పంచ్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

అత్తిలి ఎంపీపీ రంభ సుజాత

అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష పదవికి అత్తిలి- 1 ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, ఉపాధ్యక్ష పదవికి గుమ్మంపాడు ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను పేర్లను ఖరారు చేశారు. మండలంలో మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు వైసీపీ 16, టీడీపీ, జనసేన రెండేసి చొప్పున ఎంపీటీసీ స్థానాలను గెలుచుకుంది. ఎంపీపీ పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. సుజాత, తిరుపతిపురం ఎంపీటీసీ మక్కా సూర్యనారాయణ ఆశించడంతో పెద్ద మనుషుల ఒప్పందం మేరకు చెరో రెండున్నరేళ్లపాటు ఎంపీపీగా పనిచేసేందుకు అంగీకారం కుదిరింది. మొదటి రెండున్నరేళ్ళు ఎంపీపీగా మక్కా సూర్యనారాయణ, మంచిలి, ఈడూరు ఎంపీటీసీ సభ్యులు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావు వైస్ ఎంపీపీలుగా పనిచేశారు. ఒప్పందం మేరకు వీరి పదవీ కాలం పూర్తి కావడంతో గతేడాది సూర్యనారాయణ, శిరీషా రాజీనామా చేశారు. 2వ వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు ఇన్‌చార్జి ఎంపీపీగా వ్యవహరించారు. మక్కా సూర్యనారాయణ టీడీపీలోకి వెళ్ళడంతో కూటమి పార్టీల బలం 5కు చేరింది. వైసీపీకి చెందిన 15 మంది ఎంపీటీసీలలో అత్తిలి-5 ఎంపీటీసీ సభ్యురాలు తండా జ్యోతి గల్ఫ్ వెళ్లడంతో ప్రస్తుతం వైసీపీ అభ్యర్థుల బలం 14 ఉంది. సార్వత్రిక ఎన్నికలు కోడ్‌తో అప్పట్లో నిలిచి పోయిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వ హించేందుకు ప్రభుత్వ ఆదేశాలు రావడంతో గురువారం ఎన్నికను జరపడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీగా సుజాత, వైస్ ఎంపీపీగా అద్దంకి శ్రీను ఎన్నిక లాంఛనం కానుంది. గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎంపీడీవో పి.శామ్యూల్ తెలిపారు.

యలమంచిలి ఎంపీపీ బరిలో ధనలక్ష్మి

యలమంచిలి ఎంపీపీ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.ప్రేమాన్విత తెలిపారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎంపీపీ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకోగా యలమంచిలి-2 ఎంపీటీసీ సభ్యురాలు రావూరి వెంకటరమణ, ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మి చెరో రెండున్నరేళ్ల పంచుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. మొదటి రెండున్నరేళ్ల వెంకటరమణ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి 2024 మార్చిలో రాజీనామా చేశారు. 2025 జనవరిలో యలమంచిలి ఇన్‌ఛార్జ్ ఎంపీపీగా గొల్లపల్లి శ్రీనివాసరావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. జనవరి 24న శ్రీనివాసరావు ఇన్‌ఛార్జ్ ఎంపీపీగా బాధ్యతలు కొన సాగిస్తున్నారు. మండలంలో 18 మంది ఎంపీ టీసీలకు గాను ముగ్గురు టీడీపీ, ఒక జనసేన, 13 మంది వైసీపీ ఎంపీటీసీలున్నారు. నేటి ఎన్నికలో ఏనుగువానిలంక ఎంపీటీసీ వినుకొండ ధనలక్ష్మి ఎంపీపీగా పోటీలో ఉన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగే గ్రామాలు

- పశ్చిమ గోదావరిలో.. మల్లవరం, గొంది, గొల్ల వానితిప్ప, గూట్లపాడు, ఎల్‌వీఎన్ పురం, తుందుర్రు, బేతపూడి, కేఎస్ గట్టు, కొత్తపాడు, కేపీ పాలెం సౌత్, పేరుపాలెం సౌత్, గోరింటా డ, అగర్తిపా లెం, ఎస్‌ఆర్ఆర్ అగ్రహారం,పెరి కేపాలెం, అబ్బిరాజుపాలెం, గొరగనమూడి..
- ఏలూరు జిల్లాలో ప్రొద్దువాక, రేచర్ల, ముదు తాళ్ళపాడు, లోకమూడి, రామసింగవరం, కొండలరావుపాలెం, దెందులూరు, ఎనికేపల్లి, భాస్కరరావుపేట, అచ్యుతాపురం..
- తూర్పుగోదావరిలో పెనకనమెట్ట, కొవ్వూరు పాడు, గోపాలపురం, వెంకటాయపాలెం, తాడి పూడి, ఉండ్రాజవరం గ్రామ పంచాయతీలకు..

కూటమి, వైసీపీ నేతల్లో ఉత్కంఠ

కైకలూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నికపై ఉత్కంఠ రేపుతుంది. కూటమి నేతల్లో, వైసీపీ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందోనని నియోజక వర్గ ప్రజల్లో చర్చనీయంశంగా మారింది. ఇప్పటికే ఎవరికి వారే ఎంపీటీసీ సభ్యులతో వేరువేరుగా శిబిరాలు నిర్వహిస్తున్నారు. కైకలూరు మండలంలో 22 మంది ఎంపీటీసీలు ఉండగా ఒకరు మృతి చెందగా 21 మంది సభ్యులున్నారు. ఈ 21 మందిలో ఒకరు తెలుగుదేశం పార్టీ నుంచి గెలుపొందగా మరో 9మంది గత సార్వత్రిక ఎన్నికల ముందు, తర్వాత కూటమిలో చేరారు. దీంతో కూటమి బలం 10 మందికి చేరింది. వైసీపీకి చెందిన కైకలూరు 4వ సెగ్మెంట్ ఎంపీటీసీ మహ్మద్ జహీర్ వైస్ ఎంపీపీ-1 పదవిలో ఉన్నారు. అనూహ్యంగా బుధవారం ఆయన వైస్ ఎంపీపీ పదవికి, ఎంపీటీసీ సభ్యత్వానికి రాజీనామా పత్రాలను కృష్ణా జిల్లా జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడుకు అందజేశారు. దీంతో కూటమి నేతల్లో, వైసీపీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఊహించని పరిణామంతో వైసీపీ నేతలంతా తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటివరకు ఇరు పార్టీలకు చెరి సమానంగా ఎంపీటీసీ సభ్యులున్నట్టు సమాచారం. వైసీపీకి చెందిన పదిమంది ఎంపీటీసీలను ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు రహస్య ప్రదేశానికి తరలించారు. అలాగే వారి సభ్యులకు విప్ జారీ చేశారు. కూటమికి చెందిన ఎంపీటీసీ సభ్యులంతా ప్రత్యేక శిబిరంలో ఉంచారు. కొట్టాడ వైసీపీ ఎంపీటీసీ సిద్ధాబత్తిన సువర్ణమ్మ విదేశాల్లో ఉండడంతో ఆమెను హుటాహుటీన వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక కోసం రప్పిస్తున్నట్టు సమాచారం. దీంతో ఇరుపార్టీల్లో ఎవరిని కైకలూరు వైస్ ఎంపీపీ-2 పదవి వరిస్తుందో తెలియని ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కూటమి నేతలు కలసిగట్టుగా వ్యూహరచనలు చేస్తున్నారు. గురువారం కైకలూరు వైస్ ఎంపీపీ-2 ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎంపీడీవో కార్యాలయంలో అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.


రాజీనామా పత్రాన్ని కృష్ణా జడ్పీ సీఈవో కన్నమనాయుడుకు అందజేస్తున్న జహీర్

వేసవి అలవెన్సు లేనట్టే?

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఆ ఊసేలేదు



ఏలూరురూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ వేతనదారులకు వేసవి అలవెన్సు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా జనవరిలో అలవెన్సు ప్రకటించేవారు. కాని ఈసారి మార్చి ముగుస్తున్నా ఇంతవరకు ఆ ఊసేలేదు. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో వేతనదారులు పని ప్రదేశంలో ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.300 తగ్గకుండా చూడాలని కేంద్రం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే ఆ మొత్తంలోనే వేసవి అలవెన్సు ఉంటుందని పలువురు చెబుతున్నారు. మరోవైపు మార్చి నెల పూర్తి కావొస్తుంది. ఈ నేపథ్యంలో ఉపాధి వేతనదారులకు వేసవి అలవెన్సు లేనట్టేనన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. జిల్లాలో సుమారు 2.10 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. వాటిలో 3.28 లక్షల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. వేసవిలో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉందని భావించిన ప్రభుత్వాలు గత ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి వంద శాతం పనికి వేతనం అందించేవారు. అంటే పనిలో నేల గట్టిగా ఉండడంతో పని తక్కువగా జరిగినా వేసవి అలవెన్సుతో కలిసి వేతనం ఇచ్చేవారు. దీంతో వేతనదారులకు కూలి గిట్టుబాటు అయ్యేది. ప్రస్తుతం జిల్లాలో చెరువుల్లో పూడికతీత, నీటి కుంటలు, పంట కాల్వ తవ్వకం వంటివి చేపడుతు న్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఏప్రిల్ నుంచి మరిన్ని పని దినాలు కల్పించే అవకాశం ఉంది. 50 మంది కూలీలను పనులకు తీసుకొచ్చే ప్రతీ మేట్‌కు రూపాయిన్నర వంతున అదనపు వేతనం అంది స్తారు. కాగా కూలీలకు వేసవి అలవెన్సు విషయమై అధికారుల వివరణ కోరగా ఇప్పటివరకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని, ఆదేశాలు వస్తే అమలు చేస్తామని తెలిపారు.



ఏటిగట్టు గండ్లు పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోలవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ గ్రామంలో ఏటిగట్టుకి పట్టిసీమ ఉత్సవాల సందర్భంలో చేసిన గండ్లను అఖండ గోదావరి రివర్ బండ్ అధికారులు బుధవారం పూడ్చివేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో గోదావరి ఏటిగట్టుకి తూట్లు పేరిట వచ్చిన వార్తా కథనానికి స్పందించిన అధికారులు అఖండ గోదావరి రివర్ బండ్ ఏఈ మణికంఠ ఆధ్వర్యంలో మట్టివేసి పూడ్చివేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


విజిలెన్స్‌కు ఫిర్యాదు పెట్టిందెవరో..?

నరసాపురంలో జోరుగా చర్చ

నరసాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మునిసిపాలిటీలో విజిలెన్స్ తనిఖీలు పెద్ద సంచలనం రేకెత్తించాయి. మంగళవారం సాయంత్రం వరకు పలు రికార్డులను తనిఖీ చేసిన అధికారులు కొన్నిటిని వెంట తీసుకెళ్లారు. మరోవైపు ఒకటి రెండు విభాగాలపై కాకుండా పురపాలకంలోని అన్నిశాఖల్లో అవినీతి జరిగిదంటూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం పెద్ద హాట్‌టాపిక్‌గా మారింది. సాధారణంగా పనుల్లో అవినీతి జరిగితే ఫిర్యాదు చేస్తారు టౌన్‌ప్లానింగ్‌లో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు జరిగినా ఫిర్యాదు చేస్తుంటారు. అయితే రెవెన్యూ, శానిటరీ విభాగాలపై కూడా ఫిర్యాదు చేయడం వెనుక ఎవరి హస్తం ఉందన్నది ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. వీటితో పాటు టౌన్ ప్లానింగ్‌పై కూడావచ్చాయి. ఇవి కాకుండా కొవిడ్ సమయంలో ఇష్టానురాజ్యంగా నామినేటెడ్ పనులు చేసి బిల్లులు డ్రా చేశారన్న ఆరోపణలు లేకపోలేదు. అప్పుడు పనిచేసిన చాలామంది ఉద్యోగులు బదిలీపై వెళ్లిపోయారు. అయితే ఈ పనులకు సంబంధించిన వివరాలను ఫిర్యాదు దారు నికి ఎవరూ లీక్ చేశారన్నది ఉద్యోగ వర్గాల్లో హాట్‌టాపిక్ అయింది. విజిలెన్స్ అధికారులు మాత్రం ఫిర్యాదుదారుడి పేరు వెల్లడించ లేదు.

రోడ్లు, డ్రెయిన్లు అధ్వానం

జడ్పీ సీఈవో భీమేశ్వర్‌తో ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్



సమస్యలను నోట్ చేసుకుంటున్న జడ్పీ కార్యాలయ సిబ్బంది

"అసలే వ్యవసాయ సీజన్.. సచివాలయాల్లో వ్యవసాయ శాఖ, ఫిషరీస్ అసిస్టెంట్లు డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతాలకు వెళ్లారు. మా సమస్యలు తీర్చేదెవరు ? గ్రామాల్లో జిల్లా పరిషత్ రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. మరమ్మతులు చేపట్టాలి. మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలి.. వేసవిలో ఇబ్బందులు లేకుండా చూడాలి. చిన్న చిన్న కాలనీలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి.. డ్రెయిన్ల నీరు కాల్వల్లో కలుస్తోంది.." అంటూ ఉమ్మడి జిల్లాలోని పలువురు ఇలా తమ సమస్యలను బుధవారం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో భీమేశ్వర్‌తో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో విన్నవించారు. ఆ సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని జడ్పీ సీఈవో వారికి చెప్పారు.

- ఏలూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)

వేసవి వచ్చేసింది.. నీటి సమస్య రాకుండా చూడండి

సచివాలయాల్లో సిబ్బంది కొరత
ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్లు
సమస్యలు పరిష్కారం అవక ఇక్కట్లు
ఉమ్మడి జిల్లాల నుంచి ఫోన్‌లో సమస్యలు విన్నవించిన ప్రజలు

- హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌కి వెళ్లాం. నాపేరు, నా భార్య పేరు మ్యాపింగ్‌లో యాడ్ అయింది. నా కుమార్తె పేరు నల్లజర్ల మండలం శింగరాజుపాలెం గ్రామంలోని వేరే కుటుంబంలో యాడ్ అయింది. ఈ సమస్య పరిష్కరించాలి

అశ్వనీకుమార్, కృష్ణాయిపాలెం, తాడేపల్లిగూడెం మండలం

జడ్పీ సీఈవో : ఆ సచివాలయంలో డిలీట్ ఆప్షన్ లేదు. ఎడిట్ ఆప్షన్ తీసుకుని ఈ సమస్య పరిష్కరిస్తాం.

- మా ఇంటికి దారిలేదు. ట్యాంకు పోరంబోకు స్థలాన్ని మూసి వేయడంతో దారి లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించాలి

శ్రీనివాసరావు, బాలేపల్లి , వీరవాసరం మండలం

సీఈవో : ఈ సమస్యను అక్కడి పంచాయతీ అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తాం.

- పెదరామవరం గ్రామం నుంచి చినరామవరం మీదుగా పల్లెవాడకు 8 కిలోమీటర్లు మేర జిల్లా పరిషత్‌కు చెందిన మట్టిరోడ్డు ఉంది. ఈ రహదారిని అభివృద్ధి పరచాలి

వీరాంజనేయ ప్రసాద్,రామన్నగూడెం, కైకలూరు మండలం

సీఈవో: ఈ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో హైస్కూల్, కాన్వెంట్‌లు ఉన్న ప్రదేశంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు

ఎస్.గంగాధరరావు, ఇరగవరం

సీఈవో: సంబంధిత అధికారులకు ఈ సమస్యను వివరిస్తాం. పరిష్కారానికి కృషి చేస్తాం.

- మా గ్రామంలో 2013 సంవత్సరంలో జడ్పీ నిధులతో మినీ బస్టాండ్ ఏర్పాటు చేశారు. నేటికీ ఆ బస్టాండ్‌ను ఆర్టీసీకి స్వాధీన పరచలేదు. బస్టాండ్‌లో టాయిలెట్ సౌకర్యం లేదు. అక్కడ టాయిలెట్ ఏర్పాటు చేయాలి

పి.సర్వేశ్వరరావు, చింతలపూడి

సీఈవో : ఈ సమస్య పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో చెత్త వేసే ప్రదేశంలో ప్లాస్టిక్ పదార్థాలను కాల్చివేస్తున్నారు.ఆ దారిలో వెళ్లేవారు ఊపిరాడక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం కూడా ఉంది. అలాగే బ్రాందీ షాపువద్ద గ్లాసులను విచ్చలవిడిగా పడి వేస్తున్నారు. పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. బోరు నుంచి సాల్ట్ వాటర్ వస్తోంది. గ్రామంలో అనేక సమస్యలున్నాయి. ఇవన్నీ పరిష్కరించాలి

- కె.ఆనందరావు, రాయకుదురు, ఇరగవరం

సీఈవో: దీనిపై అక్కడి పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోతో మాట్లాడతాం. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తారు.

- మా గ్రామంలో పంటకాల్వల్లో పంచాయతీ మురుగును వదిలివేయడం వల్ల కాలుష్యం ఏర్పడుతోంది. రూ.14 కోట్లతో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులు సగమే పూర్తి చేశారు.

వి.దివాకర్, వీరవాసరం

సీఈవో: సంబంధిత అధికారులకు తెలియజేస్తాం .

- పెదకాపవరం గ్రామంలో ఒకే ఒక్క సచివాలయం ఉంది. సచివాలయ సిబ్బంది డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. కాని ఇక్కడ సిబ్బంది కొరత వల్ల అసలు పనులు నిర్వహణ జరగటం లేదు.

సత్యనారాయణ, పెదకాపవరం, ఆకివీడు మండలం

సీఈవో: సచివాయ వ్యవస్థలో మార్పులు జరుగుతున్నాయి. డిజిటల్ అసిస్టెంట్‌ల సమస్య పరిష్కస్తాం. ఇతర సిబ్బంది విషయమై సంబంధిత అధికారులతో చర్చిస్తాం.

- మా గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ లేదు, అగ్నిమాపక కేంద్రం లేదు. సంత మార్కెట్ రహదారి చాలా చిన్నదిగా ఉంది.

ఎస్.సీతారాంబాబు, ఆచంట

సీఈవో : సంబంధిత అధికారులకు వివరిస్తాం.

- పబ్లిక్ వాటర్ ట్యాప్ నుంచి నీరు తీసుకుంటున్నాం. మా ఇంటికి మంచినీటి కుళాయి ఇప్పించాలి

వి.దుర్గావెంకట సత్యనారాయణ, నారాయణపురం, ఉంగుటూరు మండలం

సీఈవో : స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తాం

- మా గ్రామానికి కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ కావాలి. ఈ విషయాన్ని పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కి తెలియజేశాం

ఎన్.వెంకటేశ్వరరావు, చనుబండ, చాట్రాయి మండలం

సీఈవో: మీ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో సచివాలయ సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ఉన్న సిబ్బందిని డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతాలకు తీసుకు వెళుతున్నారు. గ్రామంలో పనులు ఎలా?

కె.విద్యాసాగర్, పెదకాపవరం, ఆకివీడు



జడ్పీ, ఆర్థిక సంఘ నిధులతో రహదారులు, డ్రెయిన్ల పనులు

జిల్లా పరిషత్ పరిధిలో జడ్పీ సాధారణ నిధులు, ఆర్థిక సంఘ నిదులతో గ్రామాల్లో రహదారులు,డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వేసవికాలం దృష్టిలో ఉంచుకుని జడ్పీ పరిధిలోని సీపీడబ్ల్యు పథకాల నిర్వహణకు రూ.37 కోట్లు కేటాయించాం. ఈ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పర్య వేక్షిస్తున్నది. జిల్లా పరిషత్ పరిధిలో రహదారులు, సచివా లయ ఉద్యోగుల డిప్యూటేషన్ సమస్యలు, ఇంకా అనేక సమస్యలపై పలువురు ఫోన్ చేసి చెప్పారు. వీటన్నింటినీ పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం గ్రామాల్లో మంచినీటి పథకాలకు సంబంధించి బోర్లు, పైప్ లైన్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి నిధులు కేటాయిస్తాం. ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు ఆ సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరిస్తాం.

- కె.భీమేశ్వర్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సీఈవో , ఏలూరు

సీఈవో : సచివాలయ సిబ్బంది డిప్యూటేషన్ విషయం పరిశీలిస్తున్నాం. తగిన చర్యలు తీసుకుంటాం.

- మా గ్రామంలో మంచినీరు పసర రంగులో వస్తోంది. నీరును బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. కనీసం స్నానం చేయటానికి కూడా ఈ నీరు పనిచేయదు.

ఎం.లక్ష్మి, ఆకుతీగపాడు, పెంటపాడు మండలం

సీఈవో: స్థానిక గ్రామ కార్యదర్శిని అడిగి ఈ సమస్య పరిష్కరిస్తాం.

- గ్రామంలో మూడు కాలనీలకు సంబంధించిన రహదారికి వీధి లైట్లు లేవు. సమస్య పరిష్కరించాలి

అభిషేక్ కుమార్,వట్లూరు, పెదపాడు మండలం

సీఈవో: స్థానిక గ్రామ కార్యదర్శికి ఈ సమస్యను తెలియజేస్తాం.

కళ కళ కోసం కాదు..ప్రజల కోసం.. అని చెబుతుంటారు.. కళ ప్రజలకు ఆనందాన్ని పంచేది మాత్రమే కాదు.. ప్రజల్లో చైతన్యాన్ని నింపుతుంది.. ఆలోచనా శక్తిని వికసింపచేస్తుంది.. ఎందరో కళాకారులు రంగస్థలానికి వన్నె తెచ్చారు.. వెండితెర వెలుగుల మాటున తెరమరుగవకుండా కొంతమంది కళాకారులు నాటక రంగానికి ఊపిరి పోస్తున్నారు.. నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం.. ఈ సందర్భంగా కళారంగానికి సేవలందించిన కొందరు కళామతల్లి ముద్దుబిడ్డల పరిచయ కథనం..

రంగస్థలంలో రారాజులు



విశ్వామిత్రుడి వేషధారణలో కూనపరెడ్డి సత్యనారాయణ

విశ్వామిత్ర పాత్రకు జీవం..

ఎక్కడ నాటకం వేసినా ఆయనకే ఆహ్వానం

గ్రామీణ ప్రాంతాల్లో విభిన్న రంగాల్లో ప్రతిభావంతులైన వారు ఎంతో మంది ఉంటారు. బాధ్యత కల్గిన రంగానికి తనకు మక్కువ ఉన్న మరో రంగానికి సేవలందించడం కొందరికే సాధ్యం. ఈ కోవకు చెందిన విద్యావంతుడు, కళాకారుడు ముదినేపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ. ఆరుపదుల వయసు దాటినా కళారంగంపై తనకు ఉన్న మక్కువతో పౌరాణిక రంగంలో వివిధ పాత్రల్లో ప్రేక్షకుల మెప్పిస్తూ వారి ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. తన 11వ ఏటనే చెన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు టీచర్ మద్దూరి రామ్మోహనరావు ప్రోద్బలంతో సాంఘిక నాటకాలు ప్రదర్శించిన ఆయన కొంత కాలం తరువాత అదే గ్రామంలోని నాటక సమాజం ద్వారా పౌరాణిక రంగస్థలానికి పరిచయం అయ్యారు. సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడిగా, రామాంజనేయ యుద్ధంలో విశ్వామిత్రుడు, లక్ష్మణుడి పాత్రలను పోషించి కళాకారుడిగా పేరు గాంచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకంలో విశ్వామిత్రుడిగా సుమారు 300లకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్నో చోట్ల సత్కారాలు అందు కున్నారు. రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన ఎంతో మంది కాకలు తీరిన రంగస్థల నటుల సరసన విశ్వామిత్ర పాత్రలో నటించి, మెప్పించి వారికి దీటుగా నిలిచారు. ఇప్ప టికీ హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఎక్కడైనా జరుగుతుందంటే విశ్వామిత్రుడిగా నాటక సమాజాలు ఆయనకే ఆహ్వానం పలుకుతాయి.

నాటకాలను ప్రోత్సహించాలి



నాటక రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి. తెలుగు పద్య నాటకాల చాతుర్యం చాలా గొప్పది. నాటకాల ద్వారా సమాజానికి ఒక సందేశం ఇవ్వడమే కాక వినోదం కూడా కలిగించవచ్చు. కళాకారులు ఎంతో మందికి జీవనోపాధి కల్పించవచ్చు.

- ముదినేపల్లి (ఆంధ్రజ్యోతి)



రంగస్థల భీష్ముడు..

84 ఏళ్ల వయసులోనూ కళాసేవలో రాజా తాతయ్య

వ్యక్తిగా ఆయన నిరాడంబరుడు.. బేషజాలకు వెళ్ళని వ్యక్తి. సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. నటుడిగా, రచయితగా, దర్శకునిగా, పరిషత్ నాటికల న్యాయ నిర్ణేతగా, సన్మాన పత్రాల రూపకర్తగా పేరొందారు.. 84 ఏళ్ళ వయసులో కూడా తన కళా తృష్ణను వీడలేదు. ఆయన జీవితం ఎందరో కళాకారులకు ఆదర్శం. కళలకు నిలయమైన పాలకొల్లులో రాజా తాతయ్య 1941వ సంవత్సరంలో రాజా గురుస్వామి, మహాలక్ష్మమ్మలకు జన్మించారు. పేదరికం కారణంగా రోజుకొకరి ఇంటిలో భోజనం చేస్తూ వారాల అబ్బాయిగా చదువు కొనసాగించారు. నటనపై ఆసక్తితో ప్రతాప శ్రీరామమూర్తి అనే ఉపాధ్యాయుని ప్రోత్సాహంతో పోతుకూచి విద్యాసాగర్ వద్ద నాటకాల్లో శిక్షణ పొందారు. చదువు కొనసాగించ లేక అమ్మమ్మగారి ఇంటికి పాలకొల్లు వచ్చి స్థిరపడ్డారు. తాతయ్యలోని కళాకారుడుకి ఉపిరి పోసింది పాలకొల్లు.. పాలకొల్లులో 60 ఏళ్ల క్రితం కొట్టాడ సత్యనారాయణ దర్శకత్వంలో 'పల్లెపడచు' నాటిక ద్వారా తాతయ్య నటుడిగా ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. యదార్థం నాటికను రాశారు. తాతయ్య పలు నాటకాల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ పండిత, పామరుల మెప్పు అందుకున్నారు. అంతేకాకుండా పలు పరిషత్ లకు న్యాయ నిర్ణేతగా వ్యహరించారు. ఎన్నో సభలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. కళాకారుడు గానే కాకుండా 1981లో 12వ వార్డు నుంచి మున్సిపల్ కౌన్సిలర్‌గా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1992 మరలా కౌన్సిలర్‌గా విజయం సాధించారు. సహచరులు : ప్రసిద్ధ సినీ దర్శకుడు దాసరి నారాయణ రావు, కోడి రామకృష్ణలతో పాటు పాలకొల్లులోని అందరు కళారంగ సేవకులు మిత్రులే.

ఎన్నో అవార్డులు..సత్కారాలు

నంది అవార్డుతో పాటు కందుకూరి విశిష్ట పురస్కారం, 2017లో (శ్రీవెంకటేశ్వర నాటక కళా పరిషత్ తిరుపతి) గరుడ అవార్డును తాతయ్య అందుకున్నారు. డాక్టర్ గరికపాటి రాజారావు జీవన సాఫల్య పురస్కారం, (ప్రజా రంగ స్థల కళావేదిక ఐపోలవరం అభ్యుదయ కళాసమితి), తూర్పు గోదావరి జిల్లా బండారు లంక వారి జీవన సాఫల్య పురస్కారం పొందారు. సుమారు 27 నాటికలు, 9 నాటకాలలో ముఖ్య పాత్రలను పోషించారు. కొన్ని నాటికలకు దర్శకత్వం వహించారు. శకుని, తప్పెవరిదిలో తాతయ్య పాత్ర ఆయనకు మంచి పేరు తెచ్చాయి. సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక పాత్రలు, గంభీర పాత్రలు, ఏక పాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించారు.



కాకినాడలో సత్కారం అందుకుంటున్న తాతయ్య (ఫైల్) **- పాలకొల్లు అర్బన్ (ఆంధ్రజ్యోతి)**

నాటకాల్లో పడి సంపాదన మరిచాను..



ఇప్పటికీ నా వయసు 84. సుమారు 70 ఏళ్లు..నాటకాల్లో పడి సంపాదన మరిచిపోయాను నాకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. వారి వారి జీవనం వారికి ఏర్పాటు చేశా. దాతల సహ కారంతో సొంత గూడు రంగులు వేయించుకునేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంపూర్ణం ఆరోగ్యంతో కళా సేవలోనే కన్ను మూయాలన్నది నా ఆకాంక్ష. పాలకొల్లులో ఒకసారి సమిధ నాటిక ప్రదర్శన సమయంలో సంగీత దర్శకుడు (ఫ్లూట్ వాయించే వ్యక్తి)రాలేదు.. ఏం చేయాలని ఆలోచించి పాలకొల్లు - భీమవరం ప్యాసింజర్ రైలులో ప్రతీ రోజూ ఫ్లూట్ వాయిస్తూ బిక్షాటన చేసే ఒక అంధుడిని గుర్తించి అతడిని తీసుకువచ్చి సంగీత దర్శకునిగా అవకాశం కల్పించడం, ప్రేక్షకుల మన్ననలు పొందడం నేను మరుచిపోలేని సంఘటన..



కృష్ణుడు పాత్రలో విజయకుమార్ రాజు

షణ్ముఖి వారసునిగా

విజయ కుమార్‌రాజు

ఆంధ్ర బాల గంధర్వ షణ్ముఖి అంజనేయ రాజు నాటక రంగంలో ఎనలేని కీర్తి ప్రతిష్టలు సాధించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. నాటక రంగంలో ఆయన పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు.. ఆయన వారుసుడిగా కుమారుడు షణ్ముఖి విజయకుమార్ రాజు వివిధ పౌరాణిక పాత్రల్లో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పౌరాణిక రంగానికి విశేషమైన గుర్తింపు తెచ్చిన తణుకు ప్రాంతానికి చెందిన షణ్ముఖ అంజనేయరాజు వారసుడిగా విజయరామరాజు ఆంధ్ర, ఆంధ్రేతర రాష్ట్రాల్లో తన గాన నైపుణ్యంతో బహుముఖ పాత్రలతో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే తండ్రి వద్ద మెళకువలు నేర్చుకున్నారు. ఇపుడు మంచి నటుడిగా గుర్తింపు అందుకున్నారు. 26 సంవత్స రాలుగా రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. అంజనేయుడు, శ్రీకృష్ణ తులాభారంలో నారదుడు, కురుక్షేత్రంలో కృష్ణుడు ఇలా ఎన్నో పాత్రల్లో తన అసమాన ప్రతి భతో ప్రేక్షకుల మెప్పు పొందారు. ఇటీవల గాన గంధర్వ బిరుదుతో పాటు వెండి కిరీటంతో సత్కారం అందుకున్నారు. ఆంజనేయరాజు పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి ఆయన జయంతి రోజున పేద కళాకారులకు రూ.10 వేలు నగదు పురస్కారం అందిస్తున్నారు.

-తణుకు (ఆంధ్రజ్యోతి)



సత్య హరిశ్చంద్ర, ధుర్యోధనుడి పాత్రల్లో..

నాటకమే ఆయన జీవితం..

పౌరాణిక, సాంఘిక పాత్రలతో ఆకట్టుకుంటున్న తేరా రంగారావు

ఆయన నిరక్షరాస్యుడు. కానీ.. కళారంగంలో ఆయన ఒక పెద్దబాలశిక్ష వంటివారు. చదవడం, రాయడం రాకపోయినా ఎదుటివారు చెప్పిన పదాలు, పద్యాలను వంట పట్టించుకుని, ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసి స్టేజిపై అదరగొట్టి అందిరిచేత చప్పట్లు కొట్టించుకోవడం ఆయనకే సొంతం. అతని ప్రతిభను గుర్తించిన స్థానికంగా ఉన్న కళాశాల అటెండర్ ఉద్యోగ మిచ్చి గౌరవించింది. ఆయనలోని కళే కుటుంబానికి ఆదరువైంది. ముగ్గురు పిల్లలను ప్రయోజకులను చేయడానికి దోహదపడింది. సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన తేరా రంగారావు 56 ఏళ్ళ వయసులో బరువైన పాత్రలను పోషిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

తనకు దూరమవుతాడనే..

50 ఏళ్లనాడు పెద్ద కుమారుడు ఉద్యోగంలో చేరి వేరే ప్రాంతానికి వెళ్లిపోవడంతో రెండో కుమారుడిని పాఠశాలకు పంపించడమే మానేశాడు రంగారావు తండ్రి. తనతో పాటు వ్యవసాయ పనుల్లో చేదోడుగా తీసుకెళ్లేవాడు. అలాంటి ఆ బాలుడు ఏడేళ్ల వయసులో ముఖానికి రంగేసుకున్నాడు. 12 ఏళ్ల వయసులో దావీదు విజయంలో మేక అనే రాణి పాత్రను వేసి మెప్పించాడు. అక్కడ నుంచి ఆ బాలుడు నాటకాలపై ఆసక్తిని పెంచుకుని, రకరకాల పాత్రల్లో నటిస్తూ వచ్చాడు. అలా ముఖానికి రంగేసుకుని స్టేజీమీద చెప్తున్న డైలాగులకు ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో అభినందిస్తుంటే అందులో పూర్తిగా లీనమై నాటకాలనే ప్రవృత్తిగా చేసుకున్నాడు.పాత్రలోని డైలాగులను ఎవ్వరైనా చెప్తే, అది విని స్టేజీ మీద తన గాత్రంతో ప్రేక్షకులతో కరతాళ ధ్వనులు పలికించేవారు. చిన్నతనం నుంచి నాటకరంగంపై మక్కువ పెంచుకున్న ఆయన దుర్యోధనుడు, మాయల పకీరు, సత్యహరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు.. ఇలా ప్రాత ఏదైనా దానికి ప్రాణం పోయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. రాష్ట్రంలో ఎక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నా అక్కడ ఈయన ఉండాల్సిందే. ఉత్తరాదిన విశాఖ నుంచి గుంటూరు వరకు వందలసార్లు స్టేజీమీద సాంఘిక, పౌరాణిక నాటకాల్లో రంగారావు నటించారు. తాజాగా ఈనెల 8వ తేదీన విశాఖపట్నంలోని ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో మమత ఈవెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో దుర్యోధన (మయసభ సీను) ఏకపాత్రాభినయంలో ప్రేక్షకులను మురిపించారు. నిర్వహణదారుల నుంచి ప్రశంసలు, సత్కారాలు అందుకున్నారు. దీంతో పాటు తాను పనిచేసే దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు తదితరుల నుంచి సత్కారాలు అందుకున్నారు.రంగారావుకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశారు. కుమారుడు దంతవైద్య కళాశాలలోనే టెక్నీషియన్ కోర్సు చేసి, హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు.

- పెదవేగి (ఆంధ్రజ్యోతి)

నేడు, రేపు వేడి గాలుల తీవ్రత

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

ఏలూరుసిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈనెల 27, 28 వేడిగాలులతో వాతావరణం వేడెక్కనుంది. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ బుధవారం తెలిపింది. ఏలూరు జిల్లాలో ఈనెల 27న 18 మండలాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 6 మండలాలు, తూర్పు గోదావరి జిల్లాలో 8 మండలాలు, 28న ఏలూరు జిల్లాలోని 20 మండలాలు, పశ్చిమలో 8 మండలాల్లో వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ఏలూరు జిల్లాలో 27న ఆగిరిపల్లి, భీమడోలు, బుట్టాయిగూడెం, దెందులూరు, ద్వారకాతిరుమల, ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, మండవల్లి, నిడమర్రు, నూజివీడు, పెదవేగి, పెదపాడు, పోలవరం, ఉంగుటూరు, వేలేరుపాడు మండలాలు. 28న భీమడోలు, బుట్టాయిగూడెం, దెందులూరు, ద్వారకాతిరుమల, ఏలూరు, జంగారెడ్డిగూడెంక్రైకలూరు, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, లింగపాలెం, మండవల్లి, ముసునూరు, నిడమర్రు, నూజివీడు, పెదవేగి, పెదపాడు, ఉంగుటూరు, వేలేరుపాడు మండలాల్లో వేడి గాలుల ప్రభావం ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లాలో 27న ఆకివీడు, ఇరగవరం, పెంటపాడు, గణపవరం, తాడేపల్లిగూడెం, తణుకు మండలాలు. 28న ఆకివీడు, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు, తాడేపల్లిగూడెం, గణపవరం, తణుకు, ఉండి మండలాలు, తూర్పుగోదావరి జిల్లాలో 27న చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, తాళ్ళపూడి, ఉండ్రాజవరం మండలాలు, 28న చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, తాళ్ళపూడి, ఉండ్రాజవరం మండలాల్లో వేడి గాలుల తీవ్రత ఉంటుంది.

లేస్ ఎగ్జిబిషన్.. 20 వేల మంది సందర్శన

నరసాపురం రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేస్ ట్రేడింగ్ సెంటర్‌లో ఐదు రోజుల పాటు హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 20 వేల మంది ఎగ్జిబిషన్ సందర్శించినట్లు ట్రేడింగ్ కన్వీనర్ కలవకొలను తులసీ చెప్పారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన 70మంది హస్తకళల స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన అనేక మంది లేస్ ఎగుమతిదారులు, మహిళలు ఉత్పత్తులు ప్రదర్శించారన్నారు. అధికారులు కూడా స్టాళ్లను పరిశీలించారన్నారు. ఐదు రోజుల పాటు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎగ్జిబిషన్ జరిగిందన్నారు. లేస్ ఉత్పత్తులను ఆదరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆడ్డగళ్ళ బాబు, పులపర్తి ప్రతాప్, కావలి నాని, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రానికి జాతీయ పురస్కారం

ఢిల్లీ ప్రదర్శనలో జంగారెడ్డిగూడెం యువకుడి ప్రతిభ



న్యూఢిల్లీలో జాతీయ మానవహక్కుల కమిషన్ జ్యూరీ నుంచి పురస్కారం అందుకుంటున్న నవీన్

జంగారెడ్డిగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నవీన్ లొట్ల మహిళలపై దాడులు, గృహహింస, సమాజ జోక్యంపై నిర్మించి, దర్శకత్వం వహించిన 'బి ఏ హ్యూమన్' లఘు చిత్రం జాతీయ పురస్కారం అందుకుంది. నవీన్ బుధవారం వివరాలు తెలియజేశాడు. ఈ నెల 25న న్యూఢిల్లీలో జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్మన్ జస్టిస్ సి.రామ సుబ్రహ్మణియన్ ఆధ్వర్యంలో జరిగిన లఘు చిత్రాల ఫిల్మ్‌ఫెస్టివల్‌లో నవీన్ చిత్రం పురస్కారానికి ఎంపికైంది. మానవ హక్కుల కమిషన్ జ్యూరీ సభ్యులు జస్టిస్ బిద్యుత్ రంజన్ స్మరన్, విజయభారతి సాయని, సెక్రటరీ జనరల్ భరత్‌లాల్, డీజీ ఐఆర్.ప్రసాద్ మీనా, రిజిస్ట్రార్ జోగిందర్ సింగ్ నుంచి నవీన్ పురస్కారం అందుకున్నారు. 303 లఘు చిత్రాలు పోటీ పడగా నవీన్ లొట్ల రూపొందించిన బి ఏ హ్యూమన్ లఘుచిత్రం స్పెషల్ మెన్షన్ జాతీయ పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజు ల్లో సమాజహిత చిత్రాలు నిర్మిస్తానన్నారు.



రైతులు నమ్మి బకాయిలు చెల్లిస్తే

మోసగించిన సొసైటీ ఉద్యోగి

తణుకు రూరల్ మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దువ్వ సహకార సంఘం (పీఏసీఎస్) ఉద్యోగి కొప్పిశెట్టి రామ హనుమకుమార్‌పై రైతుల పెట్టుకున్న నమ్మకమే రైతులను నిండా ముంచింది. ప్రతీ అవసరానికి అందుబాటులో ఉంటున్నాడనే నమ్మకంతో గ్రామస్తులు అతన్ని సొసైటీ రాముగా పిలిచేవారు. సొసైటీకి చెల్లించవలసిన బకాయిలను రైతులు రాము ఫోన్ పే నంబరు ద్వారా చెల్లించేశారు. రెండేళ్లుగా రైతుల సొసైటీ బకాయిల సొమ్ము వసూలు చేసి సొసైటీకి జమ చేయలేదు. పైగా రైతులకు వాట్సాప్ ద్వారా రసీదులు పంపించాడు. ఈ ఏడాది బకాయిలు చెల్లించేందుకు సొసైటీకి వచ్చిన రైతులకు 2023 నాటి బకాయి ఉందని చెప్పడంతో కంగుతిన్నారు. సొసైటీ సిబ్బందిని పలువురు రైతులు నిలదీయడంతో రాముకు ఫోన్ పే ద్వారా చెల్లించిన మొత్తం సొసైటీలో నమోదు కాలేదని చెప్పారు. దీనితో మంగళవారం జరిగిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో రైతులు అధికారులను నిలదీశారు. సహకార ఉద్యోగిని రైతులు అతిగా నమ్మడం కారణంగానే ఎక్కువగా మోసం జరిగినట్లు పేర్కొన్నారు. కొందరు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది. ఎంత మంది రైతుల నుంచి ఫోన్ పే ద్వారా సొమ్ములు తీసుకున్నారో లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని రైతులను పర్సన్ ఇన్‌చార్జి పి.వెంకటేశ్వరరావు కోరారు. రైతుల సొమ్ములతో పరారైన ఉద్యోగి ఈనెల 12 వరకూ విధులలో ఉన్నాడని, తర్వాత ఇంటికి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి వుందని సిబ్బంది తెలిపారు. రైతులు మొత్తం రూ. 30 నుంచి 40 లక్షల వరకు అతడికి చెల్లించినట్లు చెబుతున్నారు. అధికారులకు మాత్రం ఇప్పటి వరకూ అందిన ఫిర్యాదుల మేరకు రూ. 14.22 లక్షలు అతడికి చెల్లించినట్లు తేలింది. దీనిపై ఇద్దరి ఫిర్యాదుల ఆధారంగా తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉన్నతాధికారులు నివేదిక కోరారు

దువ్వ సొసైటీ ఉద్యోగి అవకతవకలపై వారం రోజుల్లో నివేదిక పంపించాలని డివిజనల్ సహకార అధికారి ఆదేశించారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆందోళనతో ఉన్నతాధికారులు నివేదికను అందజేయాలని కోరారు. మోసపోయిన సభ్యులు, వారి మొత్తాలు ఇంకా పూర్తి వివరాలు అందవలసి వుంది. అందిన వెంటనే ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

పి.వెంకటేశ్వరరావు, పర్సన్ ఇన్‌చార్జి, సబ్ డివిజనల్ సహకార అధికారి, తణుకు

బకాయి చెల్లించలేదంటున్నారు..



సొసైటీలో రుణం తీసుకుని ఏటా వాయిదా చెల్లిస్తున్నాం. 2023, 2024లో స్టాఫ్ అసిస్టెంట్ రాముకు ఫోన్ పే ద్వారా రూ. 1,25,106 చెల్లించాను. ఈనెల 20న ఈ ఏడాది బకాయి చెల్లించేందుకు వెళితే 2023లో బకాయి కట్టలేదని చెప్పారు. రెండేళ్లుగా నోటీసులు ఎందుకు ఇవ్వలేదు. మొత్తం వ్యవహారంలో విచారణ జరిపి న్యాయం చేయాలి.

-ఎస్ ఆదిశేషు, బాధితుడు, దువ్వ

లక్ష్యం దిశగా పోలవరం

ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రాజెక్టు నిర్మాణ పనులు ఈ రెండేళ్ల పాటు క్షణం జాప్యం లేకుండా కొనసాగించడానికి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు కొంతమేర నిధులను కేంద్రం మంజూరు చేసింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు నిర్లక్ష్యం చేశారు. వరదల్లో దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి చొరవ చూపలేదు. కుంగిన డీ వాల్ నిర్మాణంపై నోరెత్త లేదు. ప్రాజెక్టు నుంచి కుడి కాల్వకు అనుసంధానం చేసే క్రమంలో జంట గుహల ఎగువ భాగం కూలి ధ్వంసమైనా పట్టించుకోలేదు. నిర్వాసిత కుటుంబాలకు ఇస్తామన్న పరిహారం ఇవ్వకుండానే జగన్ ప్రభుత్వం దగా చేసింది. ప్రాజెక్టు నిర్మాణంలో ఐదేళ్ల పాటు జాప్యం జరిగింది.



పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- శరవేగంగా డయాఫ్రం వాల్ నిర్మాణం
- కేంద్రం సహకారంతో నిధులు
- ఊపందుకున్న పనులు
- నిర్వాసితులకు పరిహారం
- మూడు నెలల్లో పునరావాసాలకు
- వైసీపీ పాలనలో ప్రాజెక్టు తిరోగమనం
- పనులకు ఎప్పటికప్పుడు సమీక్ష
- నేడు పోలవరం రానున్న సీఎం

(ఏలూరు- ఆంధ్రజ్యోతిప్రతినిధి)

గత ఐదేళ్లు నిర్లక్ష్యానికి గురైన పోలవరం ప్రాజెక్టుకు చంద్రబాబు ప్రభుత్వం తిరిగి జీవం పోసింది. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యం దిశగా పరుగులు పెట్టిస్తున్నారు.

బట్రస్ డ్యామ్ నిర్మాణం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగానే గ్యాప్-1, గ్యాప్-2 పనులు నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఎగువ కాఫర్ డ్యామ్‌కు దిగువ భాగంలో ఊట (సీపేజ్) చేరకుండా బట్రస్ డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 195 మీటర్లు నిడివితో దీనిని నిర్మిస్తారు. ఈ పనులన్నింటిని రెండు నెలల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పట్టువదలని చంద్రుడు


వైసీపీ జమానాలో రాష్ట్రం, కేంద్రం నుంచి పోలవరం పూర్తి చేయడానికి ప్రోత్సాహం లేదు. చంద్రబాబు తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే పోలవరం ప్రాజెక్టుపై దృష్టి సారించారు. పలుమార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని, ఆర్థిక మంత్రితో పాటు జలవనరులు, హోం మంత్రులతో సంప్రదింపులు జరిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టే దిశగా నివేదికలు సమర్పించారు. దీనితో రూ.12వేల కోట్లకు పైగా కేంద్రం కేటాయించింది. అంతకుముందు చేపట్టిన పనులకు బకాయిల విడుదల అంగీకరించింది. పోలవరం పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రాజెక్టు ప్రాంతంలో యంత్రాల ధ్వని వినిపిస్తోంది. వివిధ రాష్ట్రాల కార్మికులు పెద్ద సంఖ్యలో పనుల్లో నిమగ్నమయ్యారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేసే దిశగా కాంట్రాక్టు ఏజన్సీ ముందడుగు వేస్తోంది.

నిర్వాసితులకు పరిహారం ఇచ్చి..

పోలవరం నిర్వాసితులు ఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురు చూశారు. మరోవైపు గ్రామాలను ఖాళీ చేయాలనే ఒత్తిడితో వందలాది మంది నలిగిపోయారు. అధికారం దక్కించుకోడానికి వీలుగా జగన్ నిర్వాసితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. చంద్రబాబు ప్రభుత్వం నిర్వాసిత కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారంపై చొరవ తీసుకున్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రూ.980 కోట్ల పరిహారం చెల్లించారు. కాంటూరు 41.15 పరిధిలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 40 గ్రామాల నిర్వాసితులు పునరావాసాలకు తరలివెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. మూడు నెలల్లో దాదాపు 8 వేల మంది కాలనీలకు చేరనున్నారు.

డయాఫ్రం వాల్ కొత్తగా నిర్మాణం

గత ప్రభుత్వంలో గోదావరి వరదల తాకిడికి డయాఫ్రం వాల్ కొంత దెబ్బతింది. సీడబ్ల్యూసీ అధికార బృందాలు ప్రాజెక్టును ఒక్క జగన్ జమానాలోనే 16 సార్లకు పైగా సందర్శించారు. 2022-24 వరకు పోలవరం ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ఈ తరుణంలో చంద్రబాబు ప్రభుత్వ చొరవకు కేంద్రం సహకారం తోడైంది. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను విదేశీ నిపుణుల బృందం పరిశీలించారు. డయాఫ్రం వాల్ కొత్తగా నిర్మించాలన్న సిఫా ర్సును పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సీడబ్ల్యూసీ అంగీకరించాయి. కేంద్ర జలవనరుల మంత్రితో సీఎం చంద్రబాబు స్వయంగా చర్చించారు. దరిమిలా 1,396 మీటర్ల నిడివిన గోదావరిలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనులకు గత ఏడాది డిసెంబరులోనే శ్రీకారం చుట్టారు. దాదాపు 397 ప్యానళ్లుగా నిర్మాణ ప్రాంతాన్ని విభజించి బావర్ కంపెనీ పనులు కొనసాగిస్తోంది. సీఎం చంద్రబాబు మూడు నెలలకు ముందే ప్రాజెక్టును సందర్శించి కాంట్రాక్టు ఏజన్సీ, ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటివరకు 27 ప్యానళ్ల పనులు పూర్తయ్యాయి. దీంతో పాటే సమాంతరంగా ప్రధాన డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణ అవకాశాలు పరిశీలించారు.



వెంటిలేటర్‌పైనే అంజలి

ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న విద్యార్థిని



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయానికి మనస్తాపం చెంది ఆత్మహత్యానికి పాల్పడిన ఎస్.అంజలి రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై ఊపిరి తీసుకుంటుంది. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే ఏజీఎం దీపక్ మోసం చేయడంతో అంజలి ఈనెల 23న ఆసుపత్రిలోనే మత్తు ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమె డైరీలో రాయడంతో తన ఆవేదన బయటపడింది. దీనిపై విద్యార్థి సంఘాలు, బంధువులు స్పందించి ఆందోళనకు దిగాయి. తండ్రి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీసులు స్టేషన్‌లో దీపక్‌పై కేసు నమోదు చేశారు. దీపక్ కుటుంబంతో సహ పరారీలో ఉన్నాడు. మరోపక్క ఆసుపత్రి వద్ద పరిస్థితి అనుక్షణం ఆందోళనకరంగా ఉంది. అంజలి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మూడు రోజులుగా అంజలి మృత్యువుతో పోరాడుతోంది. ఉన్నత స్థాయిలో స్థిరపడి కుటుంబంతో ఆనందంగా ఉండాలని ఎన్నో కలలతో ఫార్మా డి ఫైనలియర్ చదువుతున్న అంజలి జీవితం ఊహించని మలుపుతిరిగింది. తనకు జరిగిన అన్యాయంపై తిరగబడలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం అంజలికి వైద్యులు కొన్ని పరీక్షలు నిర్వహించారు. ఆమె పరిస్థితిలో ఎటువంటి మార్పులు లేవని తెలిసింది. ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. దీపక్ కోసం గాలింపు చేపట్టారు.

రౌతుగూడెంలో ఉత్కంఠ

జీలుగుమిల్లి: అంజలి వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతున్న నేపథ్యంలో స్వగ్రామం రౌతుగూడెంలో బంధువులు, గ్రామస్థులు ఆమె కోలుకోవాలని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అంజలి ఆత్మహత్యాయత్నానికి ముందు డైరీలో రాసిన లేఖ స్థానికంగా వాట్సాప్‌లో హల్‌చల్ చేసింది. పలువురు బుధవారం రాత్రి రాజమండ్రి తరలి వెళ్లారు. తండ్రి నల్లపు దుర్గారావు, తల్లి అనంతలక్ష్మి(అమ్ములు) కుమార్తెను అల్లారు ముద్దుగా పెంచారని, ఆమెకు అన్యాయం చేసిన వారిని అరెస్ట్ చేసి కఠిన శిక్ష వెయ్యాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని కొందరు ఆస్పత్రి వద్దకు తరలివెళ్లారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్ట్

భీమవరం క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యువతిని ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. తర్వాత పెళ్లి చేసుకోమని కోరగా మొఖం చాటేసిన యువకుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సిఐ ఎం.నాగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన యువతిని గుడిసె ఉదయ్ ప్రేమించమంటూ వెంటపడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి 2023 మేలో ఆమెను లోబర్చుకున్నాడు. అప్పటి నుంచి పెళ్లి చేసుకుంటానంటూ నమ్మిస్తూ వచ్చాడు. ఇటీవల ఆ యువతి గట్టిగా నిలదీయడంతో పెళ్లి చేసుకోనని ఆ యువకుడు చెప్పడంతో ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సిఐ నాగరాజు దర్యాప్తు అనంతరం గుడిసె ఉదయ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి 15 రోజులు రిమాండ్ విధించారన్నారు. తణుకు సబ్ జైల్‌కు తరలించామని సీఐ తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

పోక్సో కేసు నమోదు

ఉండి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. బుధవారం పోలీసులు కేసు వివరాలు తెలిపారు. ఉండి మండలం అర్తమూరు పంచాయితీ పరిధిలోని కవిటంపాకలకు చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటికి ఆమె తండ్రికి పరిచయమైన గోపి తరచు వచ్చేవాడు. బాలికను లైంగికంగా వేధించడంతో ఆమె తండ్రికి విషయం చెప్పింది. ఆమె తండ్రి గోపిని మందలించి మంగళవారం రాత్రి ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

తప్పు చేశానని.. మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తప్పు చేశానని మనోవేదనతో మండలంలోని చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన వీరగంటి తేజస్విని (23) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై మృతురాలి భర్త అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. వారం రోజుల క్రితం గ్రామంలో ఏలేటి రాణికి చెందిన బంగారు వస్తువులను తేజస్విని తీసినట్లు ఆరోపించారు. ఈ విషయమై గ్రామ పెద్దల్లో పెట్టగా బంగారు వస్తువులు తానే తీసినట్లు తేజస్విని అంగీకరించి తిరిగి ఇచ్చివేసినట్లు ఏఎస్సై తెలిపారు. అప్పటి నుంచి తేజస్విని తప్పు చేశానని మనోవేదనతో ఉంది. ఆమె భర్త అనిల్ కుమార్ బుధవారం కుమారుడిని తీసుకుని బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తమ గదికి గడియ పెట్టి ఉండడంతో కిటికీలో నుంచి చూడగా తేజస్విని చీరతో ఇంటి వాసానికి ఉరికి వేలాడుతోంది. ఆమె మృతి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఒంటరినని విరక్తితో ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగిన యువకుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. యలమంచిలికి చెందిన పోతల ధనరాజు(25) చెన్నైలో వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన అతడు ఒంటరిగా జీవిస్తున్నాననే బాధతో పురుగు మందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ఆర్డీవో కార్యాలయ సబార్డినేట్

అనుమానాస్పద మృతి

జంగారెడ్డిగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయ సబార్డినేట్ నూగంటి పోలారావు (58) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. కొంతకాలం క్రితం పోలారావు భార్య మృతి చెందగా ఇద్దరు పిల్లలు వేరే ప్రాంతంలో ఉంటున్నారు. పోలారావు శ్రీనివాసపురం శివారులోని బాపూజీ నగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా విధులకు వెళ్లడం లేదు. అతడి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వీఆర్వో శ్రీనుబాబుకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో, పోలీసులు అక్కడికి చేరుకుని ఇంట్లో పరిశీలించగా పోలారావు మృతదేహాన్ని గుర్తించారు. పక్కనే పురుగుల మందు డబ్బా, కూల్‌డ్రింక్ బాటిల్ ఉండడంతో అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. ఎస్సై ఎస్‌కె.జబీర్ కేసు నమోదు చేశారు.

మృత్యువుతో పోరాడి ఓడిన శిశువు

- ముళ్ల కంచెల్లో నవజాత శిశువు
- కుక్కల దాడితో గాయాలు
- చివరికి మృత్యుఒడికి

నల్లజర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం పోతవరంలో అప్పుడే పుట్టిన శిశువును ముళ్లకంచెలో పడేశారు. మంగళవారం ఈ విషాద ఘటన జరుగగా స్థానికులు గుర్తించే సరికి శిశువును కుక్కలు గాయపరిచాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయం శిశువును 10 గంటలకు ఏలూరు ఆసుపత్రికి తరలిస్తే మధ్నాహ్నం మూడు గంటల వరకు వైద్య సేవలందించారని పలువురు చెబుతున్నారు. వైద్య సేవలు పొందిన శిశువు అర్ధరాత్రి 12గంటల వరకు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడి చివరికి మృత్యు ఒడికి చేరింది. సకాలంలో వైద్య సేవలు అందించి ఉంటే శిశువు బ్రతికే అవకాశం ఉండేదని వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృత్యువాత పడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ఏలూరు క్రైం/కామవరపుకోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కూలిపనికి వెళ్లిన మహిళను పాము కాటు వేయడంతో మృతి చెందింది. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి ఉప్పులూరి లక్ష్మి(48)కి భర్త నగేష్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం కామవరపుకోట మండలం కళ్ళచెరువు సమీపంలోని కండ్రికగూడెంలో మొక్కజొన్న పొత్తులను విరవడానికి వెళ్లింది. అక్కడ పాము కాటు వేయడంతో అపస్మారక స్థితిలో పడిపోయింది. తోటి కూలీలు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పురుగుల మందు తాగి..

టి.నరసాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముత్యాలమ్మ పేటకు చెందిన గుర్రం చెన్నారావు (32) వ్యవసాయం చేస్తూ అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చలేక ఈ నెల 25న మొక్కజొన్నతోటలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ప్రభావతి ఫిర్యాదుతో ఎస్సై ఎం.జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముసునూరులో..

ఏలూరు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో ఒక వ్యక్తి పురుగుమందు తాగడంతో చికిత్స పొందుతూ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన రాచప్రోలు నవీన్ (26)కు భార్య జీవన ఉన్నారు. అప్పులు తీర్చే మార్గం కానరాక పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ముసునూరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

భీమవరం క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ రైటర్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం శివారు నరసింహపురం గ్రామానికి చెందిన ముంజి విశ్వేశ్వరరావు (30) బుధవారం తెల్లవారుజామున రైలు పట్టాల వైపు బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం 8 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌మెన్ చూసి పోలీసులకు తెలపడంతో అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహానికి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు రైటర్ రాజబాబు తెలిపారు.

యువతి అదృశ్యం

ఏలూరు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సబ్బవరపు వారి వీధికి చెందిన యువతి (19) అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు అందడంతో బుధవారం కేసు నమోదు చేశారు. పదో తరగతి చదివి ఇంటి వద్ద ఉంటున్న ఆ యువతి ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

హోటల్స్‌లో సివిల్ సప్లయిస్ అధికారుల తనిఖీ

గృహావసర గ్యాస్ సిలెండర్లు సీజ్

ఆకివీడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గృహావసర సిలెండర్లు వినియోగిస్తున్న హోటల్స్ యజమానులపై సివిల్ సప్లయిస్ అధికారులు కేసులు నమోదు చేశారు. పట్టణ పరిధిలో బుధవారం 8 హోటల్స్ తనిఖీ చేసినట్లు పౌరసరఫరాల అధికారి మోరంపూడి మహేష్ తెలిపారు. నాలుగు హోటళ్లలో గృహావసర సిలెండర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. 6ఏ కేసు నమోదు చేసి సిలిండర్లు సీజ్ చేశారు. హోటల్స్ అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. హోటల్ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 1332 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఫిజికల్ సైన్సు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1332 మంది గైర్హాజరైనట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. 23,098 మంది రెగ్యులర్ విభాగం విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 22,536 మంది, వన్స్‌ఫెయిల్డ్ విద్యార్థులు 1313మందికి 1080 మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(అపోస్) దూరవిద్య శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్షకు 638మందికి 537 మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు.

ఇంటర్‌లో సీహెచ్‌ఈసీ గ్రూపును ఏర్పాటు చేయాలి

ఏలూరు అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీ డియట్‌లో సీహెచ్‌ఈసీ(కామర్స్, హిస్టరీ, ఎకనా మిక్స్, సివిక్స్)సబ్జెక్టుల కాంబినేషన్‌తో ఓ గ్రూపును ప్రారంభించేలా ప్రతిపాదించాలని ఉభయ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తిని జూనియర్ లెక్చరర్లు అభ్యర్థించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్సీ సందర్శించగా ఆయనకు అధ్యాపకులు ఈ ప్రతిపాదన వినిపించారు. అనంతరం పదోన్నతలపై కూడా చర్చించారు.

వైస్ ఎంపీపీ స్థానానికి నేడు ఎన్నిక : ఎంపీడీవో

ఏలూరు రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలంలో వైస్ ఎంపీపీ-2 స్థానానికి గురువారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయం వేదికగా ఎన్నిక జరగనుంది. చేతులెత్తే విధానంతో ఎన్నిక జరిపి అదే రోజు మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేయిస్తామని ఏలూరు ఎంపీడీవో వి.శ్రీలత తెలిపారు. ఒకవేళ కోరం లేక ఎన్నిక జరగని పక్షంలో మరుసటి రోజు నిర్వహిస్తామన్నారు. ఏలూరు రూరల్ మండలంలో వైస్ ఎంపీపీగా చాటపర్రు-2 ఎంపీటీసీ బి.కుమారి, ప్రత్తికోళ్లలంక ఎంపీటీసీ భలే సత్యప్రసాద్ వైస్ ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. భలే సత్యప్రసాద్ రాజీనామా చేయడంతో ఆ స్థానానికి గురువారం ఎన్నిక జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడలో ధర్నా

చింతలపూడి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముస్లిం హక్కులను కాలరాయడానికి ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ పిలుపునిచ్చారు.చింతలపూడి వచ్చిన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో ముస్లింల మనోభావాలు, ఆర్థిక మూలాలు దెబ్బతింటున్నాయన్నారు. ఆందోళనలో భాగంగా ఏపీ ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందును ముస్లిం సమాజం బహిష్కరించాలన్నారు. సీఎం చంద్రబాబు ఈ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడి తమ మనోభావాలను కాపాడాలన్నారు.

సబ్సిడీ రుణాల కోసం 951 దరఖాస్తుల స్వీకరణ

చింతలపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) :చింతలపూడి మండల వ్యాప్తంగా బీసీ, కాపు, ఈబీసీ లబ్ధిదారులు సబ్సిడీ రుణాల కోసం 951 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. 27,28 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన, ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 27న 513, 28వ తేదీన 438 దరఖాస్తులను పరిశీలిస్తామని, ఇందులో అధికంగా సీతానగరం నుంచి 108, అత్యల్పంగా ఉర్లగూడెం గ్రామం నుంచి మూడు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఆంగ్ల భాషా నైపుణ్యాల సాధనకు అతిథి ఉపన్యాసం

ఏలూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) :ఆంగ్ల భాషపై పట్టుసాధించడానికి టెడ్ టాక్స్, పాడ్ కాస్ట్ విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయని విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. డైనమిక్స్ కమ్యూనికేషన్ అరల్ అండ్ ఓరల్ స్కిల్స్ అనే అంశంపై బుధవారం సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటే విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించవచ్చని కళాశాల ఆంగ్ల విభాగాధిపతి జి.లక్ష్మీ సరస్వతి వివరించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

ఏలూరు రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ఫౌండర్ పి.జీవన్ కుమార్ డిమాండ్ చేశారు.సీతారాంపురంలో గెస్సమనే సెంట్రల్ చర్చి ప్రాంగణంలో ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ, ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. పాస్టర్లు బోధనల ద్వారా ప్రజలను సన్మార్గంలో నడిపిస్తున్నామే తప్ప ఎలాంటి నేరం చేయడం లేదన్నారు. దేవుని బోధనలతో ప్రజలను చైతన్యం చేస్తున్న పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి బాధాకరమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత కలుగ చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిక్కాల జోసెఫ్, ఫాదర్ జాన్ పీటర్, కిరణ్ పాల్, రాజేష్, జి.యోహాన్, సుధాకర్, అబ్రహం పాల్గొన్నారు.

రజక వృత్తి చెరువులను బాగు చేయించాలి

ఏలూరు రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా రజక వృత్తి చెరువులను బాగు చేయించేందుకు అధికారులు చొరవ చూపాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య తెలిపారు. బుధవారం ఏలూరులోని సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల వృత్తి చెరువుల్లో పూడిక తీయించి చెరువులను బాగు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బి.మురళీ, వి.శ్రీనివాసులు, శేషు, ఆర్.నాగేశ్వరరావు, ఎం.దుర్గారావు, కె.సుబ్బయ్య, తదతరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి గడువు పొడిగింపు

బుట్టాయగూడెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని బూసరాజుపల్లి(బాలికలు),కేఆర్ పురం, బర్రింకలపాడు(బాలురు) గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ గడువును ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు ప్రభుత్వం పెంచడం జరిగిందని ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. మూడు గురుకులాల్లో 5వ తరగతిలో 80 సీట్లు, 6 నుంచి 9 వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలు బూసరాజుపల్లిలో 7, బర్రింకలపాడులో 65, కెఆర్ పురంలో 35 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, మూడు గురుకులాల్లో ఎక్కడైనా పరీక్ష రాయవచ్చని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ద్వారకాతిరుమల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన మండలంలోని సీహెచ్ పోతేపల్లిలోని గోద్రేజ్ ఆయిల్‌పామ్ సంస్థ 52 మంది విద్యార్థులకు ఆ సంస్థ జీఎం ఎస్.మహంతి రూ.2.60 లక్షలను బుధవారం అందజేశారు. గతేడాది పది పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, రైతులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణ పథకంలో నాణ్యమైన పనిముట్లు

ఏలూరు టూటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కులవృత్తులు చేసుకునే వారికి ఆదరణ పథకంలో ఆధునిక పనిముట్లు అందిస్తామని బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత అన్నారు. బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో బీసీ సామాజికవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు చందనాడ నందీశ్వరరావు మాట్లాడుతూ గతంలో నాశిరకం పనిముట్లు సరఫరా చేశారని అటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పడాలన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నాకరరావు, కె.నాగరాజు, కె.వెంకటేశ్వరరావు, కె.రాజు, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు గాదంశెట్టికి పరామర్శ


శ్రీనివాసరావును పరామర్శిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు మాతృమూర్తి గాదంశెట్టి కృష్ణకుమారి(79) దెందులూరులోని ఆమె నివాసంలో ఇటీవల కన్నుమూశారు.ఆమె మృతికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు అంబికా రాజా, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుల రవి, వైశ్య ప్రముఖులు పయిడేటి రఘు బుధవారం శ్రీనివాసరావును పరామర్శించి సంతాపం తెలియజేశారు. కృష్ణకుమారి చేసిన సేవలను కొనియాడారు.

వాహనాల ఎల్ఈడీ లైట్లు, లౌడ్ స్పీకర్ల తొలగింపు

ఏలూరు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆటో రిక్షాలు, తేలికపాటి సరుకు రవాణా వాహనాలకు ఎల్‌ఈడీ లైట్లు, పెద్ద శబ్దం వచ్చే హారన్లు, లౌడ్ స్పీకర్లు అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాశాఖ కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. డీటీసీ కరీమ్ ఆదేశాల మేరకు ఏలూరు నగరంలో వాహన తనిఖీ అధికారులు పి.రమేష్‌బాబు, ఎస్ జగదీష్‌బాబు వారి సిబ్బంది కలిసి ఆటోలు, తేలికపాటి వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు వివరించారు.

బెల్ట్ షాపులపై మండల సమావేశంలో చర్చ

జీలుగుమిల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశంలో బెల్ట్ షాపులపై బుధవారం తీవ్ర చర్చ జరిగింది. జడ్పీటీసీ మల్లం వసంత్ ఆరోపణలపై స్పందించిన ఎక్సైజ్ ఎస్సై ఐ.జి.వి.లక్ష్మి మాట్లాడుతూ 29 కేసులు నమోదు చేశామన్నారు. తమకు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ కోర్స పొశమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు ప్రజలకు అందించే పలు పథకాలను వివరించారు.

కౌన్సిల్ సమావేశం ప్రశాంతం

నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశంలో 8 అంశాలతో అజెండా

రూ.211 కోట్ల అంచనాలతో బడ్జెట్ ఆమోదం

ఏలూరు టూటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి నగరపాలక సంస్థ 211.34 కోట్ల రూపాయల అంచనాలతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్లో బుధవారం సర్వసభ్య సాధారణ సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన జరిగింది. 2024 - 25 ఆర్థిక సంవత్సరం ముగింపు నిల్వ 46.2కోట్ల రూపాయలను ప్రారంభనిల్వగా చూపించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.165 కోట్ల ఆదాయం కార్పొరేషన్‌కు వస్తుందని అంచనా వేశారు. మొత్తం బడ్జెట్ 211.34 కోట్ల రూపాయల అంచనాలతో కౌన్సిల్ ఆమోదం పొందింది. కార్పొరేషన్‌కు సంబంధించిన ఖర్చు 199.51 కోట్లు రూపాయలని అంచనావేయగా ముగింపునిల్వ రూ.11.82 కోట్లు చూపించారు. అంచనావేసిన ఆదాయం, ట్యాక్స్‌లు, నాన్‌ప్లాన్‌గ్రాంట్లు నాన్‌ట్యాక్స్‌లు డిపాజిట్లు అడ్వాన్సుల ద్వారా రూ.80.52కోట్లు, ప్లాన్‌గ్రాంట్ల ద్వారా రూ.84.62 కోట్లు, మొత్తం రూ.165.14కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఖర్చులు, ప్రజారోగ్యం, వీధి దీపాలు, నీటిసరఫరా, టౌన్‌ప్లానింగ్, సాధారణ ఖర్చులు, గ్రాంట్లు, రుణాలు కలిపి రూ.199.51 కోట్లు ఖర్చుగా అంచనా వేశారు.

సాదాసీదాగా సమావేశం

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌన్సిల్ సమావేశం రసాబసాగా సాగేది. అధికార ప్రతిపక్ష సభ్యులు నువ్వా నేనా అన్న రీతిలో ఘర్షణలకు దిగేవారు. కానీ ఇప్పుడు కౌన్సిల్ సమావేశం సదాసీదాగా ముగిసింది. 50మంది కార్పొరేటర్లకు గానూ ముఖ్యమైన బడ్జెట్ సమావేశానికి కేవ లం 31 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. కార్పొరేటర్ల మధ్య ఒకటి, రెండు స్వల్ప వాగ్వివాదాలు మినహా ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. అందుకే బడ్జెట్ ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదం పొందింది. అనంతరం 8అంశాలతో కూడిన అజెండా ప్రవేశపెట్టారు. ఈ ఎనిమిది అంశాలు కూడా ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం పొందింది. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాలు దుర్గాభవానీ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు జి. చంద్రయ్య, బి.శివారెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర పాలక సిబ్బంది, అధికారులున్నారు.



సమావేశంలో బడ్జెట్‌పై మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్, సభ్యులు

నగరాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం..

నగరాభివృద్ధే లక్ష్యంగా పాలక మండలి పనిచేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలంలోనే కోట్లాది రూపాయ లతో రోడ్లు, డ్రైన్లు నిర్మించాం. తాగునీటి ఎద్దడి లేకుండా చేశాం. నగర ప్రజలకు రెండు పూటల తాగు నీరందిస్తున్నాం. ప్రధాన కూడళ్లలో మూడు వాటర్ ఫౌంటేన్‌లను నిర్మించాం. నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తాం. రూ.211.34 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఈ ఏడాది నగరంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతాం.

షేక్ నూర్జహాన్, నగర మేయర్

తాగు నీరు వృథా చేయొద్దు

ఈ ఏడాది గోదావరి, కృష్ణ కాల్వల్లో నీరుసరిగా ప్రవ హించక దెందులూరులోని వాటర్ ట్యాంకులో తాగు నీరు తక్కువగా ఉంది. 16.5 మీటర్ల ఎత్తు వరకు నీరు నిల్వ ఉండాలి. కానీ ఇప్పుడు 10.5 మీటర్ల వరకు మాత్రమే నీరు నిల్వ ఉంది. ఏప్రిల్ 1నుంచి గోదావరి నదిలోకి నీళ్లను ఉధృతంగా వదలనున్నారు.

భాను ప్రతాప్, నగర కమిషనర్

రెండు చోట్ల చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. దుడ్డు రాజారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారపుపేటలో రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. న్యూమార్కెట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో మరో చలివేంద్రం ప్రారంభించారు. పాదచారులు, వాహనదారులకు మజ్జిగను పంపిణీ చేశారు. భవిష్యత్తులో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వై.నాగబాబు, శ్రీనివాస రాజు, నారాయణరావు, పి.రఘు, సీహెచ్. బ్రహ్మయ్య మారం హనుమంతరావు, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ పనుల వేగవంతానికి చర్యలు చేపట్టండి

కేంద్ర అదనపు కార్యదర్శికి ఎంపీ పుట్టా మహేశ్ విజ్ఞప్తి

ఏలూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారులకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ అదనపు కార్యదర్శి వినయ్ కుమార్‌కు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కోరారు. బుధవారం, అదనపు కార్యదర్శికి ఎంపీ పుట్టా మహేష్ స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, నిధులు మంజూరు చేయాల్సిన అభివృద్ధి పనులు, కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలపై అదనపు కార్యదర్శితో ఎంపీ చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకుంటూ జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి నిధుల మంజూరులో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ పుట్టా మహేష్ విన్నవించారు. కాగా, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరుకు వెళ్లే జాతీయ రహదారిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఫ్లై-ఓవర్ నిర్మాణం, కల్వర్టు నిర్మాణం, తుక్కులూరు నుంచి నూజివీడు మున్సిపల్ ఏరియా చివరి వరకు ఇరువైపులా 6 కి.మీ సర్వీస్ రోడ్డు కనెక్టివిటీ, నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు కూడలి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం, తుక్కులూరు నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా నూజివీడు వరకు జాతీయ రహదారిపై మరో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని అదనపు కార్యదర్శి వినయ్‌కుమార్‌కు ఎంపీ పుట్టా మహేష్ విజ్ఞప్తి చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు


మద్దిక్షేత్రం హుండీ లెక్కింపులో అధికారులు

పెదవేగి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు భక్తులు హుండీలద్వారా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 107 రోజులకు గానూ రూ.16లక్షల 14వేల 380 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఏలూరు తనిఖీదారు వి.సురేష్ పర్యవేక్షణలో గ్రామస్థులు, భక్తుల సమక్షంలో బుధవారం ఉదయం హుండీలను లెక్కించామని ఆయన చెప్పారు.

మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో..

జంగారెడ్డిగూడెం : గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం గోకుల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవో మానికల రాంబాబు సమక్షంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. 97 రోజులకు గాను రూ.50లక్షల 84వేల 145, అన్నదానం హుండీ ద్వారా రూ.1,02,700 మొత్తం రూ.51,86,845 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్.వి. చందన తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి


గ్రీవెన్స్‌లో వినతులు అందజేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుకు పలువురు గిరిజనులు వినతిపత్రాలు అందజేశారు. బుధవారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో బొరగం శ్రీనివాసులు గ్రీవెన్స్‌ను నిర్వహించగా నియోజకవర్గంలోని గిరిజనులు హాజరై సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనపర్తి వెంకట నారాయణ, మొగపర్తి సోంబాబు, గంగిరెడ్ల మేఘలాదేవి, గద్దె అబ్బులు, మొడియం సింగరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లను అభివృద్ధి చేయడం,డ్రైయిన్ల అభివృద్ధి, ప్రజలకు సురక్షితమైన తాగు నీటిని అందించడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్, పెదపాడు మండలాల ఎంపీడీవోలు శ్రీనివాస్, శ్రీదేవి, శ్రీలత,జమాల్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి : సీపీఎం

ఏలూరు టూటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి బీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కమిషనర్ భానుప్రతాప్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనకారావు, ప్రసాద్, సోమయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : ఏజెన్సీలోని భూవివాదాలను పరి ష్కారించాలని, రహదారులు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు కేఆర్ పురం ఐటీడీఏ ఎదుట ధర్నా చేశారు. తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కారం భాస్కర్, ఎ.ఫ్రాన్సిస్, టి.దుర్గారావు, పి.నాగేశ్వరరావు, బి.భూచంద్రం, బుల్లెమ్మ, శాంతి పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన మూడు నెలల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా నేత ఆర్.లింగరాజు డిమాండ్ చేసారు. మండలంలోని పంగిడిగూడెంలో జరుగుతున్న ఉపాధి పనులను సీపీఎం బృంద సభ్యులు బుధవారం పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 15 రోజులు దాటితే కూలి ఇవ్వకుంటే చట్టరీత్యా నేరమని, ఇది ప్రభుత్వ వైఫల్యమన్నారు. కార్యక్రమంలో నేతలు కె.భాస్కరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

రాంచరణ్ పుట్టిన రోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న చరణ్ అభిమాన సంఘ నాయకులు

ఏలూరురూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) :రాంచరణ్ రాష్ట్ర యువశక్తి, మెగా ఫ్యామిలీ సీనియర్స్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో తమ అభిమాన హీరో పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మాదేపల్లి ప్రేమాలయం ఆశ్రమంలో వృద్ధులకు అన్నసమారాధన ఏర్పాటు చేసి వారి మధ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జనసేన నాయకులు నారా శేషు, రాంచరణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు డి.పెదబాబు, మెగా అభిమానులు శానం శ్రీరామకృష్ణమూర్తి, పి.జగన్, మారం అను, పి.సురేష్, పవన్, ఆర్.కళ్యాణ్, నరేష్, ఆది, రాజు, శానం ఉదయ్‌సాయి, నవీన్, పండు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్

ఏలూరు రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని చేనేత వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 45 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్టు ఆప్కో రాజమహేంద్రవరం మండల వాణిజ్య అధికారి వి.హరిప్రసాదరావు తెలిపారు. సి.ఆర్. రెడ్డి షోరూమ్ నేతబజార్ భవనం, సిఆర్ రెడ్డి కళాశాల ఎదురుగా ఆప్కో విక్రయశాలల్లో డిస్కౌంట్లు అందిస్తున్నట్టు తెలిపారు. చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి కార్మికులను ఆదరించాలని ఆయన కోరారు.

నూతన కౌలు చట్టం తీసుకురావాలి

చింతలపూడి, మార్చి26(ఆంధ్రజ్యోతి) : నూతన కౌలు చట్టం తీసుకురావాలని కౌలు రైతు సంఘం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ చట్టం తేవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మల్లాయిగూడెం, రేచర్ల రైతు సేవా కేంద్రాల్లో సంఘ సమితి సభ్యులు విజ్ఞాపన అందచేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి డి.కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా తమ డిమాండ్లు నెరవేరలేదన్నారు. కార్యక్రమాల్లో టి.నాగు, బి.సత్యనారాయణ, సి.హెచ్.కృష్ణ, ప్రసాదరావు, సూరయ్య, చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన

చింతలపూడి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : నాబార్డు నిధులు రూ.20 కోట్లతో నిర్మిస్తున్న బోయగూడెం - సీతానగరం రోడ్డును శెట్టివారిగూడెం వద్ద బుధవారం విజయవాడ క్వాలిటీ కంట్రోల్ అధికారులు, నూజివీడు పంచాయతీరాజ్ పీఐయు విభాగం అధికారులు పరిశీలించారు. పంచాయతీరాజ్ ఈఈ టి.బాపిరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈ కె.రవికుమార్, జంగారెడ్డిగూడెం క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ కృష్ణకుమారి, విజయవాడకు చెందిన క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఏఈఈ విజయ్‌గోపాల్, ఏఈ చంద్రశేఖర్, చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఏలూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా తిరుమల దత్త క్షేత్రమైన శనివారపుపేటలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి ఉదయం విశేష పూజలు, నిత్య హోమం, బలిహరణ నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.27న నిత్య హోమం, పంచామృత స్నపన, చక్రస్నానం, పూర్ణాహుతి, రాత్రి ధ్వజారోహణ నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు హయగ్రీవాచార్యులు తెలిపారు.

సబ్సిడీపై రైతులకు యంత్ర పరికరాలు

బుట్టాయగూడెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయంలో ఉపయోగపడే విధంగా 50 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. బుధవారం కోటనాగవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పరికరాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. పొలాలను పరిశీలించి సూచనలు, సలహాలు తెలియజేశారు. అంతకముందు విశిష్ట సంఖ్య నమోదును వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారి, పశుసంవర్థక శాఖ, సేంద్రియ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి):ధర్మాజీగూడెంలో ఎస్ఐ కె.వెంకన్న ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనర్‌లు, విద్యార్థులు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల నేపథ్యంలో పలువురు విద్యార్థులు మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాలపై వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. మైనర్లకు వాహనాలిస్తే వాహన యజమానులు, మైనర్ల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పది లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఏలూరు ఆర్టీవో కృష్ణారావు తెలిపారు. కేంద్రం ఈనెల 15న డ్రైవింగ్ టెస్ట్ సెంటర్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆర్టీసీ, వాహన డీలర్లు, డ్రైవింగ్ స్కూలు యాజమాన్యాలతో జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్టీవో కృష్ణారావు బుధవారం తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డీటీసీ షేక్ కరీమ్‌ను సంప్రదించాలన్నారు.

వాహనాల పన్ను చెల్లించండి

ఏలూరు క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : 2023 -24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లాలో రవాణా వాహనాలకు పన్ను చెల్లించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ హెచ్చరించారు. ప్రత్యేక తనిఖీల్లో ఇప్పటి వరకూ పన్ను చెల్లించని 104 రవాణా వాహనాలపై కేసులు నమోదు చేసి ఆరు లక్షల 11 వేల రూపాయలు అపరాధ రుసుం విధించగా 23 వాహనాలను సీజ్ చేసినట్లు డీటీసీ తెలిపారు. కేసు నమోదు చేస్తే చట్టరీత్యా 200 శాతం పెనాల్టీ విధిస్తామని, స్వచ్ఛందంగా 50 శాతం పెనాల్టీతో త్రైమాసిక పన్ను చెల్లించవచ్చని తెలిపారు.

ఇంటర్వ్యూ..

పాఠ్యపుస్తకాల్లో మార్పులు

డి.సుబ్బారావు, మండల విద్యాశాఖాధికారి, కామవరపుకోట



● 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలేమిటి?

జవాబు : ప్రతీ పాఠశాలలో ప్రత్యేక వనరులతో కూడిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక రూపొందించాం. పాఠశాలలను ఆహ్లాదకరంగా ఉంచడం, మంచినీటి సదుపాయాలు కల్పించడం, ప్రశాంతమైన బోధన నిర్వహిస్తాం. రెగ్యులర్ విద్యార్థులతో పాటు చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

● పాఠ్య పుస్తకాలు ఎప్పుడు అందచేస్తారు?

జవాబు : పాఠశాలల ప్రారంభం నాటికే అందరికీ పాఠ్య పుస్తకాలు, కిట్‌లు అందజేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించాం.

● విద్యతో పాటు ఇతర సౌకర్యాలేంటి?

జవాబు : వ్యాయామం, ఆటపాటలు ఏర్పాటు చేయిస్తున్నాం.

● పాఠ్యపుస్తకాల్లో చేస్తున్న మార్పులు, చేర్పులు?

జవాబు : ఒకటి నుంచి 5 తరగతులకు తెలుగు, ఆంగ్ల, గణితం కలిపి ఒకే పుస్తకంగా ముద్రిస్తున్నాం. వర్క్‌బుక్ అదనంగా వస్తుంది.

● 6-9 తరగతుల విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో మార్పులున్నాయా?

జవాబు : తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకే బుక్‌గా వస్తుంది. ఎస్ఎస్, పీఎస్ కలిపి ఒకటిగా వస్తుంది. సాంఘిక శాస్త్రం మూడు పుస్తకాలు ఉండగా ఇప్పుడు ఒకటిగా మార్చేశారు. పదవ తరగతిలో హిందీ పాఠ్య పుస్తకం మార్పు చేశారు.

- కామవరపుకోట(ఆంధ్రజ్యోతి)

రేపు మండల పరిషత్ సమావేశం

టి.నర్సాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మణి కుమారి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 28న మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ ధారబోయిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల్లో సాధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

భీమడోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేసి రూ.2000 లాక్కుని పారిపోయిన ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. 23న పోలసానపల్లి గ్రామానికి చెందిన కోట కిరణ్ అనే వ్యక్తి భీమడోలు మెడ్‌ప్లస్ మెడికల్ షాపు వద్ద ఉండగా ముగ్గురు వ్యక్తులు అడ్డగించి ఆ వ్యక్తిని కొట్టి సొమ్ము లాక్కెళ్లారు. ఈ కేసులో మద్దా కల్యాణ్, జి.సాంబశివ అనే ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

కురెళ్లగూడెంలో చోరీ

భీమడోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : కురెళ్ళగూడెంలో 25వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన రావిపాటి సత్య శ్రీనివాసరావు ఇంట్లో చొరపడి మూడున్నర కేజీల వెండి వస్తువులు పట్టుకుపోయారు. ఆ ఇంటి యజమాని శ్రీనివాస్ తిరుమల వెళ్లి వచ్చే సరికే ఇల్లంతా చిందరవందరగా ఉండటం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేశారు.

జడ్పీ చైర్ పర్సన్ అభినందన

ఏలూరుసిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్‌డీసీ ఎం.ముక్కంటి బుధవారం జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆమె ఈడీ ముక్కంటిని అభినందించారు.

ఉపాధి పనులు నిర్వహించాలి

కామవరపుకోట, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం.సరళ కుమారి, ఏపీవో ఎస్.కె.మొహిద్దీన్‌లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది, మేట్‌లు తదితర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, వాటి ప్రగతిపై ఆరా తీశారు. నమోదైన జాబ్ కార్డుదారులంతా పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సహాయం అందిస్తాం

ఏలూరు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జైల్లో రిమాండ్ ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయసహాయాన్ని అందిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా జైలును బుధవారం ఆయన సందర్శించి ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన బాధ్యత జిల్లా న్యాయసేవాధికార సంస్థకు ఉందన్నారు. ప్రతి వారంలో నాలుగు రోజులు పారాలీగల్ వాలంటీర్లు ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి ఆ వివరాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేస్తారన్నారు.


కార్యకర్తల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న టీడీపీ నేతలు

కైకలూరులో ప్రతీ బుధవారం గ్రీవెన్స్‌డే

నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు

కైకలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సమస్యలు, గ్రామాల్లో ఉండే సామాజిక సమస్యల పరిష్కారం కోసం అర్జీల స్వీకరణ జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో బుధవారం టీడీపీ కార్యకర్తలో సమావేశాన్ని, ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలు వారి సమస్యలు పరిష్కారం కోసం ఫిర్యాదు చేసేందుకు రాష్ట్రపార్టీ కార్యలయానికి వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారని అందువల్లే కైకలూరు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ఇకపై ప్రతీ బుధవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్రపార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, కోకన్వీనర్‌లు కొడాలి వినోద్, బొమ్మనబోయిన విజయలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎండీ జానీ,మహిళ నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో ఉద్యోగవకాశాలు పొందిన యువతీ, యువకులు

జాబ్‌మేళాలో 64 మందికి ఉద్యోగాలు

కైకలూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 64 మందికి ఉపాధి అవకాశం లభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత తెలిపారు. కళాశాలలో బుధవారం రాష్ట్ర నైపుణ్య సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాకు 155 మంది యువతీ యువకులు హాజరుకాగా వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇందులో 64 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సభ్యులు పాల్ దివాకర్, రవికుమార్, ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన అభ్యాసంతో మెరుగైన ఫలితాలు

నూజివీడు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) ప్రణాళికాబద్ధంగా విద్యాభ్యాసం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని ట్రిపుల్ ఐటీ నుంచి గేట్‌కి ఎంపికైన విద్యార్థులు నిరూపించారని నూజివీడు డైరెక్టర్ ఆర్జీకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని సాక్ ఆడిటోరియంలో గేట్‌కి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.


అభినందన సభలో మాట్లాడుతున్న డైరెక్టర్

క్యాంపస్‌లోని హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ద్వారా గేట్‌కి ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేశామ న్నారు. ఫలితంగానే గేట్‌కు 400 మంది విద్యార్థులు క్యాలిఫై అవగా 1000 లోపు ర్యాంకులు 30 మంది సాధించారన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధనకు చర్యలు తీసుకోవాలని ట్రిపుల్ ఐటీ అధికారులకు సూచించారు. ఏవో లక్ష్మణ్ ఫైనాన్స్ ఆఫీస్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను నేరవేర్చాలి


వేల్పుచర్లలో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

ముసునూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యాదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన ప్రచార జాత బుధవారం వేల్పుచర్ల, బలివే, గుడిపాడు గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సమస్యలతో పాటు ఉపాధి కూలీల సమస్యలను నాయకులు తెలుసుకున్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడుతూ ఆర్థిక అసమానతలు తొలిగించడానికి ప్రభుత్వాలపై సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం నేడు తీవ్ర సంక్షోభంలో ఉందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో, నిత్యవసరాల ధరలు తగ్గించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తొలుత కామ్రేడ్ విమలక్క స్థూపం వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహా, రాయంకుల లక్ష్మణరావు, కొక్కిర పాటి ఆనంద్ పాల్గొన్నారు.


సింహాద్రిపురం వద్ద రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని ఆందోళన

ముసునూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి సింహాద్రిపురం మీదుగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ బుధవారం స్థానికులు ఆందోళన చేశారు. సింహాద్రిపురం సెంటర్‌లో పెద్దపెద్ద గుంతలు పడి అధ్వానంగా ఉందని, దీని వల్ల వాహన దారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఈ రహదారి కనీస మరమ్మతులకు నోచుకోలేద న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికి ఈ రహదారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలం వస్తే ఈ రహదారిపై ఉన్న గుంతలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయని, సింహాద్రిపురం సెంటర్ అయితే అర కిలో మీటరు వరకు నెలల తరబడి నీరు ఉంటున్న పరిస్థితి నెలకొందన్నారు. రహదారి అభివృద్ధికి మంత్రి పార్థసారథి చర్యలు తీసుకోవాలని కోరారు.

సచివాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

ముసునూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవల్లి గ్రామ సచివాలయం వద్ద టీడీపీ నాయకుడు సౌజన్యంతో మంచినీటి సౌకర్యం సమకూరింది. మంగళవారం స్థానిక నాయకుడు జోనుబోయిన రాంబాబు తన సొంత ఖర్చులతో సచివాలయం వద్ద నూతన మట్టి కుండలను ఏర్పాటు చేసి మంచినీరును పోయించారు. రాంబాబు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని సచివాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగుల దహార్తిని తీర్చేందుకు తాగు నీటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వేసవి పూర్తయ్యేవరకు అందిస్తామని తెలిపారు.

గురుకుల పాఠశాలకు కూరగాయలు అందజేత

ముసునూరు, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): ముసు నూరు గురుకుల పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు తమవంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. మంగళవారం ఎస్ఎంసీ వైస్ చైర్మన్ కె.రాధిక తిరుపతిరావు బాలకల భోజనం నిమిత్తం సొరకాయలు, టామాటాలు తదితర కూరగాయలు అందజేశారు.



నేడు భాస్కరరావుపేట పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక

కలిదిండి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భాస్కరావుపేట పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కొండలరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం పోటీ ఉంటే చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలి

ఏవో విద్యాసాగర్



కోరుకొల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో విద్యాసాగర్

కలిదిండి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. కోరుకొల్లు, కొచ్చెర్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాటాడుతూ సేంద్రియ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేస్తే భూమి సారవంతమవుతుందన్నారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడితే భూసారం కోల్పోతుందన్నారు. ప్రస్తుతం 30 రకాల విత్తనాలను ఖాళీగా ఉన్న భూముల్లో చల్లాలన్నారు. మొక్కలు దట్టంగా పెరిగిన తర్వాత వాటిని కలియ దున్నాలన్నారు. దీంతో భూమిలో సూక్ష్మపోషకాలు పెరుగుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించ వచ్చన్నారు. మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ ఉందన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, మండల మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్, కూటమి నాయకులు ఆమజాల బాబులు, సిరిపురపు రాజబాబు, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ అహోబలరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ముదినేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గురజ జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు బుధవారం మానసిక ఆరోగ్యం, మానసిక ప్రవర్తన అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ అధికారి రత్నసాయి కుమార్ విద్యార్థులకు మానసిక ఒత్తిడిని జయించే పరిస్థితులను వివరించారు. మనస్తత్వ శాస్త్రంపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి తన మానసిక స్థితిని మెరుగుపర్చుకుంటే భవిష్యత్‌కు ఎటువంటి అవరోధాలు ఉండవని సాయి కుమార్ తెలిపారు. మానిసిక ప్రవవర్తన పైనే విద్యార్థుల కెరీయర్ ఆధార పడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు కనుమూరు ఆంజనేయ ప్రసాద్, కోనేరు మాలతి, ఈడే వెంకటేశ్వరరావు తదిరతులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మానసిక ఒత్తిడి దూరం


ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఫిజియోథెరపిస్ట్ రమేష్

కైకలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధి నిర్వహణలో మానసిక ఒత్తిడి అధిగమించేందుకు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని నిమ్స్ ఫిజియో థెరపిస్ట్ రమేష్ అన్నారు. కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సిబ్బందికి మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఫిజియోథెరిపిస్ట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తపన ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా

మండవల్లి మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొల్లేటి ప్రజల దాహార్తిని తీర్చాలని ఉద్దేశంతో తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయులు చౌదరి బుధవారం లంక గ్రామాలకు మంచినీటి ట్యాంకర్ అందజేశారు. మండలంలోని చింతపాడులో తపన ఫౌండేషన్ ప్రతినిధి ట్యాంకర్‌ను ప్రారంబించారు. ప్రధాని నరేంద్రమోదీ కల్పిస్తున్న జలజీవన్ మిషన్ ప్రారంభమయ్యే లోపు ఏ వ్యక్తి తాగునీటికి ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో తపన ఫౌండేషన్ వారు కొల్లేటి ప్రజలకు ట్యాంక్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకటరాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది ఫిజికల్ సైన్స్ పరీక్ష

కలిదిండి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోరుకొల్లు, కలిదిండి, ఆరుతెగలపాడు, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 11 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 836 మంది విద్యార్థులకు 825 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. సమస్యాత్మకమైన కోరుకొల్లు పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముదినేపల్లి : పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు బుధవారం మండలంలో 99 శాతం విద్యార్థుల హాజరు నమోదైంది. మండలం లోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 639 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 635 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు సహాయ మాతా హైస్కూల్‌లో 52 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 49 మంది హాజరయ్యారు. తహసీల్దార్ సుభానీ, ఎంఈవో నరేష్ కుమార్ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

చాట్రాయి : చాట్రాయిలో టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 280 మందికి గాను 279 మంది, ఆర్సీఎం పరీక్షా కేంద్రంలో 159 మందికి 154 మంది హాజరైయ్యారని, ఆరుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు.

పెద్దింటి అమ్మవారి ఆదాయం రూ.15,26,615


కొల్లేటికోటలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కైకలూరు, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి హుండీల లెక్కించగా ఆదాయం రూ.15,26,615 వచ్చినట్టు ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి 43 రోజులకు గాను భక్తులు సమ ర్పించిన కానుకల హుండీలను బుధవారం గుడివాడ ఎండోమెంట్ తనిఖీ అధికారి పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.26,591 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్లను పెండ్లికుమారుడిగా, పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేసిన దృశ్యం

మండవల్లి భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి అభిషేకం

మండవల్లి మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో కొలువై ఉన్న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో వైభవంగా అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గూడూరు భవానీ శంకర్ శాస్త్రి, స్వస్తి వాచకులు ద్వాదశి కామేశ్వరశర్మ, ద్వాదశి ఫణికుమార్ శర్మ, హరి వెంకటసుబ్రహ్మణ్యం రవిశర్మ ఘనంగా విఘ్నేశ్వరపూజ చేశారు. అనంతరం పండితులు మల్లేశ్వరస్వామివారిని పెండ్లికుమారుడిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లికుమార్తెగా చేశారు. సహస్ర నామ అర్చనలు, నవగ్రహ పూజా, కలశ స్థాపన, ధ్వజారోహణ, బలిహరణ పూజలు చేశారు.

నేడు, రేపు సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

ముదినేపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఈబీసీ, కాపు కులాల సబ్సిడీ రుణాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికకు మండలంలో ఈనెల 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 27న అల్లూరు, బొమ్మినంపాడు, చేవూరు, చిగురుకోట, చినకామనపూడి, చిన పాలపర్రు, దాకరం, దేవపూడి, దేవరం, ఈడేపల్లి, గురజ, కాకినాడ, కోడూరు, కోమర్రు, కొరగురలుపాలెం, ముదినేపల్లి గ్రామాలకు చెందిన 563 మంది దరఖాస్తుదారులకు 28న ములకలపల్లి, పెదగొన్నూరు, పెదకామనపూడి, పెదపాలపర్రు, పెనుమల్లి, పేరూరు, పెయ్యేరు, ప్రొద్దువాక, సంకర్షణపురం, సింగరాయపాలెం, వూటుకూరు, వడాలి, వాడవల్లి, వైవాక, వణుదుర్రు, విరావిగుంట గ్రామాలకు చెందిన 511 మంది దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహి స్తామని తెలిపారు. దరఖాస్తుతో పాటు, ఆధార్‌కార్డు, రైస్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మహిళా పక్షపాతి చంద్రబాబు : మంత్రి కొలుసు

నూజివీడు మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మహిళా పక్షపాతి గా మరొసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. నిరూపించుకున్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో ఆయన మాట్లాడుతూ శిక్షణతో పాటు కుట్టు మిషన్లు పంపిణీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలానికే ఉచిత దీపం పథకం, అమల్లోకి తీసుకువచి మరో అద్భుతమైన పథకానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని తెల్ల రేషన్ కార్డు కలిగిన 18-50 ఏళ్ల వయసు మహిళలకు నూజివీడు పట్టణంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణలో అందించి కచ్చితంగా కుట్టు మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. శిక్షణలో 75 శాతం హాజరు కలిగిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు తెల్ల రేషన్ కార్డు గల మహిళలు దరఖాస్తులను గ్రామ వార్డు సచివాలయంలలో అందజేయాలన్నారు.

నవోదయకు ఎంపికైన పోలవరం విద్యార్థి



చాట్రాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి ఆడిమెల్లి అక్షయ్ కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే ఎన్టీఆర్ జిల్లా ఏలేరు నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం మహబూ తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా అక్షయ్ 5వ తరగతిలోకి సీటు సాధించాడని ఇంటర్ వరకు ఇక్కడ ఉన్నత ప్రమాణాలతో ఉచితం విద్యను అందిస్తారని హెచ్ఎం అన్నారు. అక్షయ్‌ని హెచ్ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

11 మంది విద్యార్థులు గైర్హాజరు

ముసునూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండంలోని ముసునూరు, గోపవరం, చెక్కపల్లి జడ్పీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపిడీవో జి.రాణీలు తనిఖీ చేశారు. పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సంప్రదాయ వ్యవసాయమే ప్రకృతి సేద్యం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

నూజివీడు మార్చి 26 (ఆంధ్రజోతి): సంప్రదాయ వ్యవసాయ విధానమే ప్రకృతి సేద్యమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా అన్నారు. తొక్కులూరులో డివిజన్ స్థాయి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, వర్క్ షాప్ నిర్వహించారు. రైతు సాధికార సంస్థ, డీఆర్‌డీపీ నిర్వహించిన కార్యక్రమంలో హబీబ్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలతో రసాయనిక ఎరువుల వల్ల భూమి నిస్సారం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ విధానం మేలు అన్నారు. ఏడీఏ విద్యాసాగర్, ముసునూరు రాజా, జగ్గవరపు వెంకటరెడ్డి, ఏవో చాముండేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నూజివీడు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ టిడ్కో భవనాలను తక్షణం లబ్ధిదారులకు అందించాలన్నారు. విద్యుత్ భారాన్ని మినహాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాపారావు, పాలిటి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని గాలికొదిలేశారు

ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య విమర్శించారు. నూజివీడు సెంటర్లో బుధవారం సీపీఐ కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాలు మధ్య చిచ్చు పెట్టడమే తప్ప ఎన్నికల హామీలను ఒకటి నెరవేర్చ లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చలసాని వెంకట రామారావు, బండి వెంకటేశ్వరావు, చాట పుల్లారావు, నరసింహ, నాగేంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్ సింగ్

చాట్రాయి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సారా నిర్మూలనకు సహకరించాలని ఎక్సైజ్ అధికారులు కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంలో బాగంగా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో సారా నిర్మూలనపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా తాగితే రోగాల బారినపడి నడి వయస్సులోనే మృత్యువాత పడతారని, కుటుంబాలు వేదన చెందుతున్నాయన్నారు. ప్రమాదకరమైన సారా తాగడం మానుకోవాలని హితవు పలికారు. సారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి పనులు చేస్తూ చట్టం దృష్టిలో నేరస్తులు కావద్దని, మంచి వృత్తులు చేసుకుంటూ గౌరవంగా జీవనం సాగించాలని సూచించారు. నరసింహారావుపాలెం, చనుబండ, గుడిపాడు, పర్వతాపురం, చిన్నంపేట గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దడానికి సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు చర్యలు

కేసీహెచ్.సూరిబాబు
మండల వ్యవసాయాధికారి



- **రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు?**

ఏవో : మండలంలో రబీ సీజన్‌లో మండలంలో 900 ఎకరాల్లో వరి సాగు చేశారు. మూడు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందవచ్చు.

- **రైతు విశిష్ట సంఖ్య నమోదు?**

ఏవో : మండలంలో 11,700 మంది రైతులున్నారు. ఇప్పటివరకు 7400 మంది రిజిస్ట్రేషన్ 74శాతం అయింది. త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తిచేస్తాం.

- **పొలం పిలుస్తోంది కార్యక్రమం?**

ఏవో: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఉపయుక్తం. చీడపీడల నివారణ, పచ్చిరొట్ట ఎరువు, సేంద్రియ సాగు పద్ధతులు, సబ్సిడీ పథకాలపై రైతులకు అవగహన కల్పిస్తున్నాం.

- **భూసార పరీక్షలు ప్రారంభించారా?**

ఏవో: భూసార పరీక్షలపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే నెలలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ముసునూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంచినీరు అనుకొని పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. గ్రామానికి చెందిన రాచప్రోలు నవీన్ (26) కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈనెల 6వ తేదీన వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో దాహం వేయగా పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోకి వెళ్లి పురుగుల మందు కలిపిన సీసాలో ఉన్న నీటిని తాగాడు. దీంతో ఇంటికి వచ్చిన కొద్దిసేపటికి అపస్మారక స్థితికి వెళ్లగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. చికిత్స పొందుతూ బుధ వారం నవీన్ మృతి చెందాడు.